# ఏకాదశ రుద్రులు




మాస్టర్ పార్వతీకుమార్

# ధనిష్ఠ ప్రచురణలు

















ప్రతులకు : ధనిష్ఠా ఫౌండేషన్, 15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్, కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.
Phone : 0891-2701531 www.dhanishta.org info@dhanishta.org

# ఏకాదశ రుద్రులు

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

**ఏకాదశ రుద్రులు**

ప్రథమ ముద్రణ : 01-09-2022 ప్రతులు : 1,000
(శ్రీ శుభకృత్ - ఋషిపంచమి)

వెల : **రూ. 40-00**

© ధనిష్ఠ ఫౌండేషన్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్, ఇండియా.

ప్రతులకు :
**ధనిష్ఠ ఫౌండేషన్,**
15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,
కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002
ఫోన్ : 0891-2701531, 2509154,
website : www.dhanistha.org.
info@dhanistha.org
ISBN : 978-81-957285-0-3.

ముద్రణ :
**ఓం నమశ్శివాయ జెరాక్స్**
మహారాణిపేట, విశాఖపట్నం.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

"**ధనిష్ఠ**" అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

"**ధనిష్ఠ**" మాస్టర్ పార్వతీకుమార్ గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

"**ధనిష్ఠ**" ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును, సద్గోష్ఠికై వలసిన వాతావరణమును – "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : **మాస్టర్ పార్వతీకుమార్**

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించుచున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ పార్వతీకుమార్** గారు. వారి బోధనలు లెక్కకుమించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణ యోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళారంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ 1997వ సంవత్సరములో "**డాక్టర్ ఆఫ్ లెటర్స్**" పట్టా నందించినది. 2013వ సంవత్సరములో గౌరవ ఆచార్యులుగా నియమింపబడిరి.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో – మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత

అలరారినప్పుడే దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, "మానవ సేవయే మాధవసేవ" అను మాటకు సరియైన అర్థము యిదేనని మాస్టరుగారు తమ ప్రవర్తన ద్వారా తెలియపరచు చున్నారు. మాస్టర్ పార్వతీకుమార్ గారు బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక – మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అష్టాంగ యోగము ననుష్ఠానము చేయుచు, వేలాదిమందితో అనుష్ఠింప చేయుచున్న యోగి. శతాధిక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తననుతాను ప్రకటించుకొనుచుండు ననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాలరనియూ, సంకలన కర్తలే ననియు మాస్టరుగారి దృఢ విశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

మాస్టర్ పార్వతీకుమార్ గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశవిదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించు చున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠ**

# ముందుమాట

ఇందు ముద్రింపబడిన *"ఏకాదశ రుద్రులు"* అను సద్విషయము మాస్టరుగారి 'భాగవత ప్రవచనముల' నుండి సంకలనము చేయబడినది. ఇది రచనము కాదు ప్రవచనము. మాస్టరుగారి భాషణము. ఇది చదువరులు గుర్తించవలెను. మాస్టరుగారు భాషణము చేయగా దానిని లేఖనము చేసిన భాగవత బృందము "నవగోపికా సంఘము". సోదరి శ్రీమతి కె. సుజాత గారి నేతృత్వమున మహిళా బృందమొకటి నవగోపికా బృందముగా తీర్చిదిద్దబడుచున్నది. భాగవత మార్గము యొక్క రుచి నెరిగి మాస్టరుగారి భాషణమును ఈ సంఘము వారు పదేపదే వివరించుకొనుచు, లేఖనము చేయుచు భాగవతానుభూతిని విస్తారముగా తామనుభవించుచు, ఇతరులకు అందించుచున్నారు. ఇప్పటికే భాగవతము ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ స్కంధములను లేఖనము గావించి ప్రచురించి ఉన్నారు.

వారు ఆస్తికుల ప్రార్థన మేరకు మాస్టరుగారి ప్రవచనముల లోని భాగవత సూక్తులను సేకరించి, రెండు మారులు ధనిష్ఠకి అందించినారు. 'మాస్టరుగారు అందించిన ఏకాదశ రుద్రులు కూడా ప్రత్యేకముగా ఒక చిన్న పుస్తకముగా రావలెను' అనెడి ఆకాంక్ష కలుగుటచే ఈ ప్రయత్నము ఆరంభమైనది. రెండు, మూడు పర్యాయములు లేఖనమును సవరించి, మాస్టరుగారి సన్నిధిని

దీనిని వినిపించి ముద్రించుట జరిగినది. ఈ సందర్భమున శ్రీమతి కె. రమణి, శ్రీ కె. ఎస్. ఆర్. గోపాల్ గార్ల సహాయ సహకారములను కూడా స్వీకరించుట, మాస్టరుగారి అభిలాషగా సాగినది. ఇందు తెలుపబడిన ఏకాదశ రుద్రుల ప్రభావము ఆస్తిక జనులందరిని తప్పక ఆకర్షింప గలదు. చిన్నతనముననే రుద్రుల గురించి తెలుసుకొనుట ఒక మహద్భాగ్యమని ఈ బృందము స్పష్టముగా భావించినది. రుద్రాధ్యయనము, రుద్ర ధ్యానము, రుద్ర ఆరాధన మానవులను ఎట్టి ఉత్కృష్ట స్థితికి చేర్చునో ఇందలి విషయములను పఠించిన గాని తెలియదు. రుద్రుని అనుగ్రహముగా వెలసిన ఈ చిన్ని పుస్తకము పాఠకులలో రుద్ర ప్రచోదనము కలిగించినచో అది రుద్రానుగ్రహముగా మేమందరము భావింతుము.

ఈ ప్రచురణను **శ్రీ నారయభట్ల ఆదినారాయణమూర్తి - శ్రీమతి సుధగార్లు** (బాపట్ల) వారి కుమారుడు **శ్రీ గౌరీశంకర్ సురేంద్ర** స్మృతి చిహ్నముగా సమర్పించిరి.

*శుభం.*

**- ధనిష్ఠ**

# విషయ సూచిక

1. పరిచయము ...... 9

2. ఏకాదశ రుద్ర స్థానములు ...... 22

3. ఏకాదశ రుద్ర నామములు – శక్తులు ...... 39

4. రుద్ర మంత్రములు ...... 69

# 1. పరిచయము

చతుర్ముఖ బ్రహ్మ నవవిధముల సృష్టి నిర్మాణం గావించి, మరియొక క్రమములో వివరించే విధానాన్ని శుకమహర్షి పరీక్షిత్తునకు అందించుచున్నాడు. చతుర్ముఖ బ్రహ్మ త్రిమూర్తులలో ఒకడు. ఆయన క్రియా స్వరూపుడు. అతడు విరాట్ పురుషుడి నాభి నుండి వ్యక్తమవుతాడు. ఈ విరాట్ పురుషుని శ్రీమహావిష్ణువు అని అంటారు. శ్రీమహావిష్ణువు జ్ఞాన స్వరూపుడు. ఆ జ్ఞానమును అనుసరించి బ్రహ్మదేవుడు సృష్టి నిర్మాణము చేస్తూ ఉంటాడు. జ్ఞానస్వరూపుడగు శ్రీమహావిష్ణువు అర్ధ నిమీలిత నేత్రుడై ధ్యానము ద్వారా శివ సంకల్పమును విని, ఆ సంకల్పమునకు జ్ఞానము సమకూర్చి, క్రియా మార్గము ద్వారా బ్రహ్మదేవుని యందు చేరి సమస్త సృష్టి కార్యమును నిర్వహిస్తూ ఉంటాడు. శివ సంకల్పమనగా సృష్టి సంకల్పమే! జీవుల సృష్టికొరకై పోషణ, పరిరక్షణ, కాలచక్ర నిర్వహణము ఇత్యాదులన్నియు ఆ సంకల్పంలో నిండి ఉంటాయి.

మహాదేవుడు ఇచ్ఛా శక్తికిని, మహావిష్ణువు జ్ఞానశక్తికిని, చతుర్ముఖ బ్రహ్మ క్రియాశక్తికిని ప్రతీకలు. వీరి ముగ్గురి ద్వారా పరము నుండి ఏడు లోకముల సృష్టి జరుగుతుంటుంది. ఏడులోకముల సృష్టిని అధిష్ఠించి సత్యలోక వాసియై బ్రహ్మదేవుడు ఉన్నాడు. అతనికి గురువై సర్వ విధముల సహకరిస్తూ

శ్రీమహావిష్ణువు వైకుంఠవాసియై ఉన్నాడు. విరాట్ పురుషుని ఫాలభాగము నందు వసించు మహాదేవుడు, పరము నుండి సృష్టి సంకల్పములను కాలానుగుణముగా అందిస్తూ ఉంటాడు. అతని నివాస స్థానము కైలాసమని ఋషులు పేర్కొన్నారు. కైలాసము, వైకుంఠము, సత్యలోకము అటుపైన ఏడు లోకములు మొత్తము పది లోకములుగా సృష్టి ఏర్పడిన విధానము భాగవతమున దర్శనము అవుతూ ఉంటుంది.

కనుకనే అర్ధ నిమీలిత నేత్రుడై "వాసుకి" పై విశ్రాంతి గొనుచున్న శ్రీమహావిష్ణువు తన దక్షిణ హస్తముతో శివలింగమును ఆరాధన చేయుచున్నట్లు, శివ సంకల్పము నెరిగి, జ్ఞానమును జోడించి, తన నాభిలో నుండి ఉత్పన్నమైన బ్రహ్మదేవుని క్రియకు ప్రేరణ నిచ్చి, జ్ఞానమిచ్చి ఆశీర్వదిస్తున్నట్లుగా శ్రీరంగనాథుని ఋషులు పరిచయం చేశారు.

పరము నుండి వ్యక్తమైన శివశక్తి స్వరూపము లేక అర్ధనారీశ్వర తత్త్వమే తర్వాతి క్రమములో త్రిమూర్తులు, త్రిశక్తులు అవుతారు. పరము నుండి ఏర్పడిన స్త్రీపురుష రూపము నరనారీ రూపము లేక అర్ధనారీ రూపము. ఈ అర్ధనారీ రూపము స్త్రీ పురుష సమాగమము కాదు. ఈ తత్త్వము స్త్రీ యు కాదు, పురుషుడు కాదు. అందు హెచ్చుతగ్గులు లేవు. వారిరువురి నుండియే త్రిమూర్తులు, త్రిశక్తులు పుట్టుకొచ్చినవి. నర–నారీ తత్త్వములను, త్రిమూర్తులను సమాగమ పరచగా పంచముఖ ఆరాధన అనాదిగా ఏర్పడుతూ వచ్చినది. ఇందు క్రియా స్వరూపుడగు బ్రహ్మదేవుని ద్వారా ఏడులోకముల సృష్టి ప్రారంభమైన సందర్భంలో అంతా

జలమయమై ఉండగా బ్రహ్మదేవుడు తపస్సు ద్వారా శ్రీమహావిష్ణువు నుండి జ్ఞానము పొంది క్రియను ఆరంభించే సమయంలో వరుసగా 1. పంచమహాపాతకములు, 2. సనకసనందనాదుల ఆవిర్భావము, 3. ఏకాదశ రుద్రుల ఆవిర్భావము, 4. ప్రజాపతుల ఆవిర్భావము, 5. సరస్వతీ ఆవిర్భావము(వాక్కు), 6. వాఙ్మయ ఆవిర్భావము, 7. మనువుల ఆవిర్భావము జరుగుతుంది.

ఈ ఏడు తరగతుల ఆవిర్భావమునే ఏడు రోజుల సృష్టిగా ఇతర మతముల వారు వివరించుకుంటూ ఉంటారు. కాని బ్రహ్మదేవుని ఆవిర్భావమునకు ముందే చాలా సృష్టి కథ నడిచినది. మనము భాగవత ప్రవచనముల ద్వారా పరము నుండి సంకల్పము, ప్రకృతి, కాలము, ఎలా ఉద్భవిస్తాయో వివరించుకుంటూ ప్రస్తుతము బ్రహ్మదేవుని నుండి రుద్రుల ఆవిర్భావము వరకు అవగాహనా ప్రయాణము సాగించాము. ఇప్పుడు రుద్రులను గూర్చి కొంత అవగాహన చేద్దాము.

బ్రహ్మదేవునికి తాను సృష్టి చేస్తున్నాను అనే భావన అహంకారముగా వచ్చినపుడు సృష్టి అంత బాగా జరగదు. నారాయణుడే తనద్వారా సృష్టి చేస్తున్నాడనే భావం ఉంటే సృష్టి బాగా జరుగుతుంది. మనం దైవం నుంచి దిగివచ్చిన వాళ్ళమే! మన జీవితమును మనమే సృష్టి చేసుకుంటాము. మనలో దివ్య సంకల్పం భాసించాలంటే మనము ప్రయత్నం చేసుకొని, అటుపైన భగవంతుని ఆరాధన చేసి, మనకు కలిగే సంకల్పాన్ని భగవత్సంకల్పంగా భావించి, ఆ సంకల్పమునకు జ్ఞానమును జోడించి నిర్వర్తించుకుంటే జీవితం చక్కగా నిర్మాణం అవుతుంది.

సంకల్పం దివ్య సంకల్పంగా దిగి రావాలంటే మనసు అతి పవిత్రంగా ఉంచుకోవలసిన అవసరం ఉంటుంది. మనసు ఎప్పటికప్పుడు ప్రాపంచిక విషయాలను ఆపాదించుకుంటూ ఉంటుంది కాబట్టి మనసు అనే అద్దానికి విషయముల యొక్క దుమ్ము పడుతుంది. ఆ మనసును ప్రతివారు పరిశుద్ధం చేసుకోవాలనే భావన కలగాలి. మనసు పవిత్రంగానే ఉంది అని అనుకుంటే సరిపోదు. దైనందినంగా వాసనలతో, రకరకముల కార్యక్రమాలలో పంచేంద్రియముల, పంచభూతముల సృష్టిలో మనం వర్తిస్తున్నప్పుడు రకరకముల మసి పడుతుంది.

బ్రహ్మము నుంచి దిగివచ్చిన చతుర్ముఖ బ్రహ్మకు తాను సృష్టిస్తున్నాను అనే అహంభావం వచ్చి, తన మూలముతో తన సంబంధం ఉన్నదన్న విషయం మరపుకి వస్తుంది. ఆ మరపే అన్నింటికీ కారణం. మరపు కారణంగా అహంకారం వచ్చి ప్రతివాడు 'నేను' 'నేను' అని అంటూ ఉంటారు. ఈ 'నేను' ఆ 'నేను' అని గుర్తు లేనపుడు ఎలాంటి కార్యక్రమాలు చేసినా నీకు తోచిన భావాలతో ఉంటాయి తప్ప, దివ్యభావన ఆవిష్కరింపబడడానికి అవకాశం ఉండదు. "అతడే నేను" అని గుర్తుంటే మన గుణములు దివ్యగుణములుగా భాసిస్తాయి. దానిని గుర్తుపెట్టుకోవడమే ప్రధానమైన సాధన. అలా గుర్తు ఉన్నంతసేపు చక్కగా జరుగుతుంది కార్యక్రమం. చతుర్ముఖ బ్రహ్మకే మరపు వచ్చించి కాబట్టి మనకు మరపు రావచ్చు అనే భావన ఉండకూడదు. మరపురాని స్థితిలో ఉండడానికి ప్రయత్నం చేయాలి. మరపే మృత్యువు. మనం మూలముతో ఎప్పుడైతే తెగిపోతామో మరణం తప్పదు. చెట్టుకొమ్మ

చెట్టునుంచి విడివడితే సజీవంగా ఉండదు. మన మూలానికి మనం కూడి ఉన్నట్లయితే మనకు మరణం ఉండదు.

బ్రహ్మదేవుడు తాను సృష్టిస్తాను అనుకోవడం వలన అవిద్యాపంచకం వచ్చింది. బ్రహ్మదేవుడు మరచిపోయి పని మొదలు పెట్టేటప్పటికి మోహం వచ్చింది. మోహంలో ఏం చేయాలో అర్థం కాలేదు. కోపం పుట్టింది. ఆ కోపం పోగొట్టుకోవడంలో తమస్సు (చీకటి) పుట్టింది. మరణిస్తాం అనే భయం పుట్టింది. రకరకాల భ్రాంతులు వచ్చాయి. ఇవన్నీ మనకి జరిగేవే! బ్రహ్మదేవునికి బీజప్రాయముగా జరిగినది. బ్రహ్మదేవునికే (మహాత్ములకే) అలా జరిగిందంటే మనం ఎంత? అని గుర్తుపెట్టుకోవాలి.

బ్రహ్మదేవుడు మనసును మరల పవిత్రం చేసుకున్నాడు. మూలమును ఒక్కసారి స్మరణ చేసుకున్నాడు. అహంకారపడ్డానని తెలుసుకొని మూలంతో ముడి వేసుకున్నాడు. తనలోనుండి తన ప్రమేయం లేకుండా నలుగురు కుమారులు దిగివచ్చారు. వాళ్ళకు ఏదో బ్రహ్మదేవుడు చెబుదామనుకుంటాడు. వారు చిరునవ్వు నవ్వారు. వారు ఏమీ మాట్లాడలేదు. వాళ్ళు అతని కన్నా ముందు నుంచే ఉన్నవారు. దైవంతో సహకరించడానికి నలుగురు కుమారులు చతుర్ముఖబ్రహ్మ ద్వారా వస్తారు. “నువ్వు చెప్పిన పని చేయడానికి కాదు, నీకు సహాయం చేయడానికి వచ్చాము” అంటారు. (నువ్వు చెప్పిన పని చేయడం వేరు, నీకు పనిచేసి పెట్టడం వేరు. నీకు పని చేసిపెట్టేవారు నీకన్నా పెద్దవారు. నువ్వు చెప్పినట్టు చెయ్యరు. ఏం చేస్తే నీపని నెరవేరుతుందో అది చేస్తారు.)

నాలుగు వ్యూహములుగా పరమాత్మయే వస్తాడు.

మనం కూడా చతుర్ముఖబ్రహ్మ లాంటి వారము. మనలో కూడా నాలుగు వ్యూహములుగా సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాతులు; రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు; వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధులు ఉన్నారు. ఈ 4 వ్యూహములు ఉండబట్టే వాక్కు కూడ పరా, పశ్యంతి, మధ్యమ, వైఖరి అను నాలుగు స్థితులలో వస్తుంది. నాలుగు యుగాలు– కృత, త్రేతా, ద్వాపర, కలి. అలాగే నాలుగు వేదాలు. మనలో పరమాత్మ, జీవాత్మ, బుద్ధి, చిత్తం; జీవులలో బాల్యం, కౌమారం, యౌవనం, వార్ధక్యం – నాలుగు వర్ణములుగా నాలుగు వ్యూహములు పనిచేస్తాయి. ఈ విధముగా నాలుగు అంతస్తుల భవనముగా సృష్టి ఏర్పాటు అయినది. శిరస్సు యందు సనకుడు, ఫాలభాగంలో సనందనుడు, హృదయంలో సనత్కుమారుడు, నాభి పైభాగంలో సనత్సుజాతుడు. వాసుదేవుడు కూడా శిరస్సుయందు విశ్రాంతి చెంది ఉంటాడు రంగనాథుడిలాగ. సంకర్షణుడు దిగి వస్తాడు బలరాముడి లాగ. ప్రద్యుమ్నుడు హృదయంలో ఉంటాడు. అనిరుద్ధుడు నాభి పైన ఉంటాడు. వీరందరూ ఒకటే! రకరకాల పేర్లు వాడారు. మన వాఙ్మయములో విశేషమేమిటంటే *"ఏకం సత్ విప్రాః బహుధా వదంతి"* ఒకే సత్యాన్ని విశిష్టమైన ప్రజ్ఞ గలవాళ్ళు రకరకాలుగా చెప్తారు. నైపుణ్యంగల వంటవాళ్ళు ఒకే పదార్థాన్ని రకరకాలుగా వండిపెడతారు. కొత్త కొత్తగా చేస్తూ ఉంటారు. మన వాఙ్మయంలోని ఈ సమన్వయము తెలియక ఏదేదో చేస్తూ ఉంటాము. ఆ తాళంచెవి అన్నింటికీ ఒకటే! కుమారులు దేవతలు కారు, యోగులు, సిద్ధులు. భగవంతుడు దిగి రావడానికి (నాలుగు వ్యూహాలుగా) కారణం వీరే! భగవంతుని ప్రతినిధులు నాలుగుచోట్ల

ఉంటారు – కేంద్రం, రాష్ట్రం, జిల్లా, తాలుకాలో ఉన్నట్లు. అంతా ఒకే పనికి సంబంధించినవారు. దైవం పని జరగడానికి ఏర్పడినవారు. గురుపరంపరలో ముందు తలచుకోవలసిన వారు ఈ నలుగురు కుమారులు.

నాలుగు వ్యూహములుగా మన సంకల్పము లేకుండా మనద్వారా దిగివచ్చినపుడు 'వారిని నియమిస్తామా? వారి సహకారంతో పనిచేస్తామా?' నలుగురు కుమారులు రాగానే వారు ఏంచేయాలో బ్రహ్మగారు గబగబా చెప్పారు. ఈ నలుగురూ జీవులకు తరింపు మార్గాన్ని చూపించడానికి వచ్చారు. సృష్టిలో వచ్చే జీవకోటికి, దైవానికి దారి చూపించే బోధకులు (teachers). దేవుడు ముందు బోధకుల (teachers)ను చూపించాడు. తరువాత పాఠశాల(school) ను ఏర్పాటు చేశాడు. మనం పాఠశాల (school) ను ఏర్పాటు చేసి తరువాత బోధకు (teachers)లను ఏర్పాటు చేస్తాం. ఇది మూర్ఖత్వం. ఎప్పుడు ఏపని చేయించాలో తెలియకపోవడం అజ్ఞానం.

దేవుడు బోధకు (teachers)లను పంపించాడు. కాని బ్రహ్మదేవునికి వారు బోధకులు (teachers) అని తెలియదు. మీరు మీ అంశలతో జీవులను పుట్టించమని చెప్పగా, బ్రహ్మదేవుని మాట వినక, నారాయణుని యందు నిష్ఠ కలిగి నిలబడ్డారు. ఈ నలుగురికి వాళ్ళు ఎందుకు వచ్చారో వారికి తెలుసు. నీకన్న పెద్దవాళ్ళు నీ దగ్గర పనిచేయడానికి వస్తే "మీరేమి చేయగలరో అదే చేయండి!" అని చెప్పాలి. ఈ నలుగురు కుమారులు తమ ఆజ్ఞను ఉల్లంఘించినందువల్ల బ్రహ్మదేవునికి క్రోధము కలిగింది.

అంతకుముందు బ్రహ్మదేవునికి కోపం వచ్చినప్పుడు చీకటి వచ్చింది. అందుకని ఇప్పుడు నిగ్రహించుకున్నాడు బ్రహ్మదేవుడు. మనం కోపాన్ని నిగ్రహించుకుంటే కళ్ళు ఎర్రబడతాయి. బ్రహ్మదేవునికి కూడ కళ్ళు ఎర్రబడ్డాయి. అందులోంచి ఎర్రగా, నీలంగా 11 మంది వచ్చేశారు. ఈయన సృష్టి చేయలేదు. ఈయనతో సంబంధం లేకుండా నారాయణుడు పంపించాడు. ఎందుకని? బ్రహ్మదేవునికి అంతగా తెలియదని. కేక పెట్టుకుంటూ రోదనం చేసుకుంటూ వచ్చారు. గట్టిగా గుండెలు పగిలేటట్లు అరిచారు. రోదనం చేస్తూ బయటకు వచ్చిన రుద్రుడు 11 మందిగా అయ్యాడు. బ్రహ్మదేవునితో సంబంధం లేకుండా కుమారులు, రుద్రులు వచ్చేస్తారు. వీరందరూ ఇతడికి సహాయపడేవారు. బ్రహ్మదేవునికన్నా పెద్దవారు. వీళ్ళమాట విని పనిచేసుకోవడమే! బ్రహ్మదేవునికి ముందే చెప్పాడు నారాయణుడు "నువ్వు కూర్చో, నేను చూసుకుంటాను" అని. చెప్పకుండా చేయలేదు. "కీర్తి నీకు, పని నాకు". అది చాలదా! అందరూ నీకు దండం పెడతారు. నువ్వు పని చేయనక్కర లేదు, నేను చేస్తాను అంటాడు. (ఈ విషయం ఆలోచించుకుంటే ఇది ఒక రహస్యం). నీ ద్వారా దైవమే నిర్విర్తించుకుంటాడు. నీవు కనుక దైవంతో అనుసంధానం చెందివుంటే నీ లోపల నీకే ఆలోచన, స్ఫురణ కలుగచేస్తాడు. ఇలా రెండు దెబ్బలు తగిలేటప్పటికి బ్రహ్మగారికి అర్ధమయింది. బ్రహ్మదేవుడు ఇలా అనుకున్నాడు. నీతో ఉంటా, నీతో కలిసే ఉంటా, నువ్వు పంపించే వాళ్లతో పని చేయించుకుంటాను అని. ఇపుడు రుద్రులు అడుగుతారు ఏం చేయాలి అని?

నలుగురు కుమారులు తన మాట వినలేదని బ్రహ్మదేవునికి మరల కోపం వచ్చింది. ఈయనకి మాటిమాటికి కోపం వస్తుందని ఈయన ద్వారా పరమాత్మ సృష్టిలోనికి ఒకరిని (రుద్రుడిని) దింపుదామనుకున్నాడు. బ్రహ్మదేవుడి ఫాలభాగం లోంచి రుద్రుడు వచ్చాడు. ఈ నాలుగు వ్యూహములలో 11 తరంగములుగా రుద్రుడు ఉంటాడు. విరాట్పురుషుడి (పరమాత్మ) ఫాలభాగంలో రుద్రుడు ఉంటాడు. అతనికి తిరుగులేదు. ఎందుచేతనంటే అతను అగ్ని స్వరూపుడు. తేజోమయమైన మూర్తి. ఆయన ఎక్కడకు దిగివస్తే అక్కడ చీకట్లు వెళ్ళిపోతాయి. వెలుగు వస్తే చీకట్లు ఎలా వెళ్లిపోతాయో, అతను దిగివస్తే చీకట్లు వెళ్ళిపోతాయి. మొదట సృష్టి జరగకముందు అంతా చీకటిగా ఉన్నది. చీకట్లో సృష్టి చేయాలంటే వెలుగు రావాలి. ఎంతమేర వెలుగు రావాలో అంత వరకు రుద్రుడు వస్తాడు.

రుద్ర రోదనము వలన రోదసి అంతా ప్రచోదనమై, ప్రణవమై వ్యాప్తి చెందుతుంది. ముందు పుట్టిన తరంగములు వాయువై భాసిస్తాయి. అంటే ఆకాశము నుండి శబ్దము, శబ్ద తరంగములనుండి వాయువు మరియు వేడిమి వృద్ధి చెందుతాయి. అటుపైన జలములు, పృథ్వి ఏర్పడతాయి. కనుకనే *"యో రుద్రో అగ్నౌయో అప్సుయ .."* అనే మంత్రం ఇవ్వబడినది. రుద్రుడి కారణంగానే రోదసి, పంచభూతములు సృష్టింపబడతాయి. మనము కూడా యోగము పేరున, భక్తి పేరున, సక్రమ మార్గములో పురోగమిస్తూ ఉంటే దేహమందలి పంచభూతములు, ప్రాణము, మనస్సు ఇత్యాదివన్ని సక్రమ నిష్పత్తిలో సర్దుకుంటాయి. ఆచార

వ్యవహారములు సర్దుబాటు అవుతాయి. వైశ్వానరాగ్ని చక్కగా వర్తించడం చేత దేహము మలినములతో చుట్టుకొనదు. అగ్ని ప్రజ్వలనము చక్కగా సాగి, శ్వాసకోశమునకు బలము ఏర్పడి, ప్రాణ వాయువును సక్రమముగా అందిపుచ్చుకుని, ఊర్ధ్వగతిగా వాయువుతో అనుసంధానము చేస్తే క్రమముగా ఆకాశము చేరి వెలుగు లోకాలలోకి ప్రవేశించవచ్చు. అగ్ని, వాయువు, ఆకాశము ఒకదానికొకటి తోడ్పడినప్పుడు లోకాతీతమగు అనుభూతులు కలుగుతాయి. శాస్త్రములు, సత్యములు కూడా తెలుస్తాయి.

రుద్రులు చేయు ఉపకారము అంత ఇంత అని తెలుపలేము. కనుకనే

***"యో రుద్రో అగ్నౌయో అప్సుయ ఓషధీషు,***
***యో రుద్రో విశ్వాభువనా వివేశ తస్మై రుద్రాయ నమో అస్తు."***

అను మంత్రమును అర్థవంతముగా భావన చెయ్యాలి. అతడు అన్నిటియందు నిండి ఉన్నాడని తెలియాలి. నిజానికతడు నిష్క్రమించలేదు. అన్ని లోకాలలోనూ స్థిరపడి ఉన్నాడు. తపస్సు చేసుకుంటూ ఉన్నా పిలిస్తే పలుకుతాడు.

సృష్టి కథే మన కథ. మనం రుద్రాభిషేకం చేస్తాం కదా! రుద్రుడిని ఫాలభాగం నుంచి పిలవాలి. ఆ రుద్రుడి పాదాలు మన మూడవకన్ను దగ్గర ఉంటాయి. ఆరాధన లోపల జరగాలి. మానవశరీరం విరాట్ పురుషుడి శరీరమే. అంతర్ దర్శనం ముఖ్యం. బాహ్యమైన దర్శనం ఎంత చేసినా మరచిపోతాము.

రుద్రుడు ఆ విధంగా వచ్చి 11మంది రుద్రులుగా

ఏర్పడతారు. పుట్టిన రుద్రుడు క్రోధస్వరూపుడు. దేవతలందరికన్నా మొదటగా ఉద్భవించాడు. అందుకే *"జ్యేష్ఠాయనమః"* అంటాము. మనలో చీకటి క్రమ్ముకోకుండా ఉండాలంటే రుద్రుని తలుచుకోవాలి. అందరికన్నా పెద్దవాడు. అతడే అగ్ని స్వరూపుడు. అన్నింటికీ ముందు ఉంటాడు. క్షీరసాగర మథనంలో గరళం మింగడానికి ముందు అతనే వస్తాడు. చీకటి, విషము, పాపము ఠక్కున హరించేస్తాడు. అందుకే *"హర హర మహాదేవ"* అంటాము. నీ పాపాలను అన్నింటిని హరించివేస్తాడు. ఆ ప్రజ్ఞలతో పోలిస్తే మనం క్రిమి కీటకాదుల కన్నా చిన్న వాళ్ళం. బ్రహ్మాండంలో మనభూమి ఆవగింజంత ఉంటుంది. ఈ ఆవగింజలో కోటానుకోట్ల జీవులు. అందులో మానవులం. ఇంత చిన్నదానిలో అంతా పెట్టేశాడు. బ్రహ్మాండంలో ఏముందో అది అణువులో ఉన్నది. పిలవగానే పలుకుతాడు. పుట్టిన వెంటనే క్రోధం పట్టలేక పెద్దగా కేక పెడతాడు. అప్పుడు శబ్దం పుడుతుంది. ఎక్కడ శబ్దం పుడితే అక్కడ అగ్ని వ్యాపనం చెందుతుంది. అందుకే శబ్దాన్ని ఉచ్చరిస్తే మన లోపల, మన పరిసరములలో ఉన్న చీకటి అంతా పోతుంది. చోటులో చీకటి ఉంటే అందులో వెలుగు ఏర్పరచుకొని సృష్టి ఏర్పాటు చేసుకోవాలి. సృష్టి మొత్తం చోటులో కొంత భాగమే. ఎన్నో సృష్టులు ఉన్నాయి. అయినప్పటికీ చోటు ఎంతో పెద్దది. ఎన్ని సృష్టులు ఉన్నాయో తెలియదు. అందులో మనది ఒక సృష్టి. మొత్తం సృష్టిలో కొంతభాగం చదను చేసుకొని సృష్టికార్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అడవిలో కొంత భాగమును చదను చేసుకొని పొలము లేక ఇల్లు ఏర్పాటు చేసుకుంటే ఎలాగో, అపరిమితమైన చోటులో పరిమితమైన చోటును ఏర్పరచి, దానిని కార్యక్రమాలకు

ఏర్పాటు చేసుకున్నారు. క్రీడారంగము (Play ground) నిర్మాణానికి ముందు ప్రదేశము చదను చేసుకున్నట్లుగా, చోటులో కొంత భాగాన్ని చదను చేయడానికి (ground clearance కి) రుద్రులు దిగి వస్తారు. దానిని "కురుక్షేత్రం" అంటారు.

ఈయన (రుద్రుడు) శబ్దస్వరూపుడు. ఓంకార స్వరూపుడు. రుద్ర నమకం చదువుతూ ఉంటే ఆ శబ్దములు ఎన్ని రకాలుగా పరిశుద్ధి కలిగిస్తాయో మనం ఊహించలేము. అవి వినాలి. చాలా ప్రకంపనలు ఉంటాయి. తరంగములు తరంగములుగా రుద్రుడు వ్యాప్తి చెందుతాడు. రోదనం చేశాడు కాబట్టి రుద్రుడన్నారు. ఇట్లు ఉద్భవించిన నీలలోహితుడు బ్రహ్మదేవుని చూచి, నాపేరు ఏమిటి? నేను ఎక్కడ నివసించాలి? అని అడిగాడు. నీలలోహితుడు అంటే నీలమా లేక నీలం లోంచి పుట్టిన ఎరుపా అన్నట్లు ఉంటుంది. కొంతమంది కళ్ళల్లో ఎరుపుజీర ఉంటుంది. ఎరుపుజీర ఉన్న కళ్ళల్లో రుద్రశక్తి ఉంటుంది. ఎరుపు జీర ప్రతాపానికి చిహ్నము. ఎర్రజీర ఒక అందం. నీలలోహితం అంటే రాగిరంగు. రుద్రుడు అడిగాడు బ్రహ్మదేవుడిని, "నా పేరు ఏమిటి? నేను ఎక్కడ నివసించాలి?" అని. రుద్ర ప్రజ్ఞ మహాప్రజ్ఞ! ఆ పలుకులు విని బ్రహ్మదేవుడు బుజ్జగించుతూ ఇలా అన్నాడు. "నీవు రోదనం చేస్తూ పుట్టావు కాబట్టి నీ పేరు రుద్రుడు. నీవు ఉండడానికి 11 స్థానములు ఏర్పరిచాను." రుద్రుడు బ్రహ్మదేవుని "నేను నీకేమి చేసిపెట్టాలి" అని అడిగాడు. బ్రహ్మదేవుడు సంకల్పిస్తే రాలేదు రుద్రుడు. ఈయన కోపంలోంచి ఆయనంతట ఆయన వచ్చేశాడు. నాలుగు వ్యూహములుగా, రుద్రుడుగా, నారాయణుడే వచ్చాడు. నారాయణుడు, రుద్రుడు వేరు వేరు కాదు. పరము, బ్రహ్మము

అది. దానినుంచి అన్నీ దిగివస్తూ ఉంటాయి. మనకొచ్చిన సమస్య ఏమిటంటే అందరినీ విడివిడిగా పెట్టేసుకుంటాము. వారే వీరు అని తెలియాలి. తత్త్వము, బ్రహ్మము, పరము అని దేనిని భాగవతం చెప్తుందో వాటికి పేర్లు లేవు. భాగవతంలో నారాయణుడు అంటారు. శివపురాణం తీసుకుంటే పరమశివుడు అంటారు. అమ్మవారి పరంగా పరాశక్తి అంటాము. శక్తికి పరమయిన సత్యము. బ్రహ్మదేవుడు అంటే సృష్టికర్త. బ్రహ్మము అంటే మూలము. తెలిసి చదువుకుంటే అవగాహన ఉంటుంది.

# ౨. ఏకాదశ రుద్ర స్థానములు

బ్రహ్మదేవుడు రుద్రునికి ఈ రకంగా 11 స్థానములు ఇచ్చాడు, అవి :

1. సూర్యుడు
2. చంద్రుడు
3. ఆకాశము
4. వాయువు
5. అగ్ని
6. జలము
7. పృథ్వి
8. ప్రాణము
9. తపస్సు
10. హృదయము
11. ఇంద్రియములు

బ్రహ్మదేవుడు చెప్తున్నాడు. పృథ్విలో ఉండు. జలములో ఉండు. (ప్రస్తుతం భూమిలో వేడి ఎక్కువ అవుతున్నది. జలములు అల్లకల్లోల మవుతున్నాయి. రుద్రుడిని తలుచుకుంటే ఆపదలు ఉండవని చెప్పడానికి కారణం అది. ప్రాణం బాగోలేకపోతే రుద్రాభిషేకం చేసుకోండి. భూమి తగాదాల గోల ఉంటే రుద్రాభిషేకం చేసుకోండి. మా మీద బాణాలు వేయకండి అని రుద్రసూక్తంలో మొట్టమొదట అడుగుతాము. మనలో తప్పులుంటే దండించేస్తాడు. నమస్తే రుద్ర మన్యవ ఎక్కడ అధర్మం ఉంటే అక్కడ రుద్రబాణం వెళ్ళిపోతుంది. *''నమస్తే రుద్ర మన్యవ ఉతోత''* అంటే "నీ విల్లుకి అల్లెతాడు తగిలించి ఉంచక, నేను ప్రార్థన చేస్తూ ఉంటే రక్షించు'' అని అర్థం. నేను బాగుపడతా! బయట అధర్మం ఉంటే నన్ను రక్షించు, నేను సుఖపడతాను. రావణాసురుడు రుద్రపూజ చేశాడు. శివానుగ్రహం పొందాడు. చిట్టచివరికి తెలిసినది మనం ఎలా పడితే అలా వాడుకోలేము రుద్రుడిని అని. మనలో తప్పులుంటే మనలను సరిచేస్తాడు. బయటవాడిలో తప్పులుంటే వాడిని నీకు సరిచేసి పెడతాడు. అదీ రుద్రుడంటే! రుద్రసూక్తంలో 5, 6 సార్లు అడుగుతాము అల్లెతాడు తీసెయ్ బాబూ! అల్లెతాడు తీసెయ్ బాబూ! అని. రుద్రుడి బాణానికి తిరుగులేదు. శివధనుస్సు ఎవరు ఎత్తగలరు? అధర్మం లేదనే జనకునికి ధనుస్సు ఇస్తాడు. రుద్రము వల్ల హృదయమందు ప్రాణస్పందన బాగా తెలుస్తుంది. అలాగే ఇంద్రియముల యందు చక్కని ప్రసారము తరంగములు తరంగములుగా ఉంటుంది).

సూర్యునియందు చక్కని ప్రకాశమునకు, చంద్రునియందు చక్కని వెన్నెలకు ఈయనే కారణం. వెన్నెల ద్వారా భూమి మీద చాలా పుట్టుకొస్తాయి. సూర్యుని కాంతి కిరణాల ద్వారా రుద్రుడు ప్రసరిస్తూ ఉంటాడు. చంద్రకాంతి ప్రసారంలో ఉన్నాడు రుద్రుడు. చంద్రుని ద్వారా మొలకెత్తుట (germination), గర్భధారణ (fertilization), పోషణ (nourishments) రుద్రుడు చేస్తాడు. అంత కోపం కలవాడూ హృదయంలో చల్లదనం ఇస్తాడు. *"శంకరాయచ, మయస్కరాయచ"* అని అభిషేకం చేస్తాం కదా! శంకరుడు అంటే ప్రశాంతమైన మనస్సు కలిగించువాడు. మయస్కరాయచ అంటే ఎంత చల్లదనం యిస్తాడో! రుద్రాభిషేకం చేసుకుంటే శివభక్తుడి మనస్సు చల్లగా అవుతుంది. 5 ఇంద్రియముల మీద స్వామిత్వం యిస్తాడు. ఈ శరీరం మీద పట్టు యిస్తాడు. అది నీ మాట వినేటట్లు చేస్తాడు. జలములో కూడా రుద్రుడు ఉంటాడు కదా! ఆవేశకావేశాలు (Emotions) నిర్మూలించి, నిర్మలమైన మనో ఇంద్రియములను ఇస్తాడు. అపుడే భక్తి నిర్మల మవుతుంది.

హనుమంతుడు వాయుపుత్రుడుగా వ్యాప్తి చెందడానికి పవిత్రీకరింపచేసేది విశేష వాయువు. సప్త మారుతములు ఉన్నాయి తెలుసా! వారు కూడా కేక పెట్టుకుంటూ వస్తారు బయటికి. మరుత్తులు రుద్రాంశలే! రావడం రావడం అరచుకుంటూ వస్తుంటే ఇంద్రుడు చెప్తాడు. "మారుదా! మారుదా!" అని. అంటే అరవకండి అని. ఇవన్నీ తన గుప్పిట్లో ఉన్నవాడు మారుతి. మనలో కూడా 7 వాయువులు ఉన్నాయి. మనయందు కొన్ని

పనిచేయవు. 4 మీద కొంచెం మనకు స్వామిత్వం ఉన్నది. 3 ఏర్పరచుకోవాలి మనలో. మనలో అవి ఉన్నాయని తెలియదుగా. Spain దేశంలో వారు మరుత్తుల గురించి చెప్పమని అడిగారు. మనవారు అడగరు. బ్రహ్మానందంగా చెప్తాను అని చెప్పాను Spain వారికి. మన పరిస్థితి ఏమిటంటే అన్నీ మన దగ్గరే ఉన్నాయి. కానీ మనకు ఏం తెలియదు. వాయువులన్నిటికీ మూలం అగ్ని. *"సప్త జిహ్వాయ నమః"* అంటాము కదా! 7 × 7 = 49. 7 లోకాలలో ఒక్కొక్క లోకంలో 7 లోకాలుంటాయి. 49 లోకాలలో 49 జ్వాలలుగా వెలుగుతూ ఉంటాడు రుద్రుడు. ఇంక మొత్తం అంతా ఉన్నట్లే కదండీ! 7 వాయువులు. 7 వాయువులలో ఒక్కొక్కదానిలో మరల 7 ఉంటాయి తెలుసా! ఆకాశం వెలుగుతున్నది అంటే రుద్రుడి మూలంగా. ఇంతటివాడు రుద్రుడు. రుద్రాభిషేకం చేసుకునేవారు ఇలా తెలుసుకుని అభిషేకం చేసుకున్నారు అనుకోండి, ఎంత బావుంటుంది?

మనం పెట్టుకున్న లింగమే రుద్రుడు అనుకుంటే ఇది ఏం చేస్తుంది అనుకుంటాం. అందులోనే అన్నీ ఉన్నాయి అని తెలియాలి. 11 మంది రుద్రులతో కలిపి లింగం. లింగము అంటే చిహ్నము అని అర్థము. లింగం అంటే బాదంకాయ, గుడ్డు ఆకారం వలె ఉండాలి అని అనుకోకూడదు. విరాట్ అనే గుడ్డు కూడా అదే. క్లుప్తంగానూ, అంతటాను ఉంటాడు. మనలో ఫాలభాగంలో ఉంటాడు రుద్రుడు. రోదనం అనగా స్పందనం. Vibration అని అర్థం. దేవతలు ప్రధానంగా నాలుగు విధములుగా పుడతారు. ఆదిత్యులు 12 మంది, రుద్రులు 11 మంది, వసువులు 8 మంది,

గంధర్వులు అసంఖ్యాకులు. రుద్రులు, ఆదిత్యులు అంతటా వ్యాప్తిచెంది ఉంటారు. ఏమిలేని చోటునుంచి అన్నీ ఉన్నట్లుగా తయారవ్వాలంటే 7 ప్రకృతులుగా దిగివస్తుంది. 8వ ప్రకృతి. దానిని అధిష్ఠించిన ప్రకృతిని కలిపి మొత్తం 9. ఇలా రకరకాల స్థితులలో "అతి సూక్ష్మం నుంచి అతి స్థూలం వరకు అధిష్ఠించిన దేవతలను వసువులు" అంటారు. అష్ట ప్రకృతులను అధిష్ఠించి అష్ట వసువులు ఉంటారు. వీరినందరినీ వివరిస్తుంది భాగవతం. ఇప్పుడు రుద్రులు వచ్చారు కదా! తరువాత ఆదిత్యులు వస్తారు. తరువాత వసువులు వస్తారు. వీరందరూ ముందు వస్తే తప్ప మిగిలినవారు పనిచేయలేరు. మనకి కూడా మన జీవితంలో ముందుగా ఒక సృష్టి జరుగుతూ ఉంటుంది. మనకి తేడా వస్తే రుద్రుడిని పిలవాలి. ఎప్పుడు తేడా వస్తే అప్పుడు పిలవడం కాదు. వారానికి ఒకసారి పిలిస్తే ఆ వారమంతా సవరించి వెళ్లిపోతుంటాడు. అందుకని సోమవారం ప్రదోష సమయంలో అభిషేకం చేసుకోమని చెప్తారు. మార్తాండుడు రుద్రస్వరూపం. వెలుగునిచ్చేవారు ఇందులోనే ఉన్నారు. సూర్యులు ఎంతోమంది ఉన్నారు. సూర్యుడు ఒక గొట్టము. చంద్రుడు ఒక గొట్టము.

గురువు కూడా ఒక గొట్టము. ఎవరికి గొట్టము? అంతరిక్ష దేవతలను, ఆపైన ఉన్న దేవతలను అందరినీ మనకి అందుబాటులోకి తేవడానికి, అసలు వాడితో కూడి ఉంటాడు. వాడి నుంచి అన్నీ దిగివస్తాయి. అందుకనే గురువును "సకల దేవతామూర్తి" అంటారు. ఎవరైనా ఆయనలోంచి పనిచేసేటట్టుగా నిరహంకారిగా ఉంటాడు. నిరహంకారిగా ఉండేవాడు

గురువు. వశిష్ఠుడు, పరాశరుడు, వేదవ్యాసుడు, శుకుడు, సనకసనందనాదులు, సప్తఋషులు, అగస్త్యుడు వీరందరూ గురువులే. ఎవరినుంచి సృష్టి ప్రజ్ఞలు మనకి అందుబాటులోకి వచ్చి మన జీవితాలను సరిచేసి పెడతాయో అలాంటి వాహికయే గురువు. తానుండగా దైవమున్నట్లుగా ఏర్పాటు చేసుకుంటాడు. దైవములో ఇమిడి ఉంటాడు. ఆదిత్యులు 12, రుద్రులు 11, వసువులు 8, పంచభూతములు + చిత్తం + బుద్ధి + అహంకారం = 8. పంచభూతములు + 3 గుణములు = 8. ఈ ఎనిమిదిగా ఉండేవి అష్టవసువులు. ఈ ఎనిమిదే అమ్మవారి 8 ఆవరణలు. 9వది ఆవిడే. అటుపైన పరమే! పరము నుంచి సంకల్పంగా వ్యక్తమై 8 ప్రకృతులను ఏర్పాటు చేస్తుంది. పరతత్త్వం 9 ప్రాకారములతో దిగివచ్చినది అన్నది కథ. అష్టప్రకృతులు మూలప్రకృతిలో కలుస్తాయి. మూలప్రకృతి పరంలోంచి దిగివచ్చింది. అష్టప్రకృతులు + 2 (మూలప్రకృతి + పరం) = 10. ద్వాదశ ఆదిత్యులు 12 + ఏకాదశ రుద్రులు 11=33. ఈ 33 దేవతలు 7 లోకాలలో ఉంటే 33 కోట్లు అవుతారు. 33 కోట్ల దేవతలు 7 లోకాలలో వ్యాప్తి చెందారు. ఒక్కొక్క లోకానికి ఒక్కొక్క సున్నా పెడతారు. 1000 అంటే 3 లోకాలు. లక్ష అంటే 5 లోకాలు. కోటి అంటే 7 లోకాలు. అలా లెక్కలు యిచ్చారు మనకు. 1 లోకానికి ఒక సున్నా సంకేతము. రుద్రుడు 11 మందిగా దిగి వచ్చాడు. సూర్యుడు, చంద్రుడు, పంచభూతములు, హృదయం, తపస్సు, ప్రాణం, ఇంద్రియములు. క్రమము తప్పకుండా మాస్టరుగారి ప్రార్థన చేసుకోవడము తపస్సు. ప్రతిరోజూ వివరంగా ప్రార్థన, ధ్యానం చేసుకుందామనే భావన ఉండాలంటే శివానుగ్రహం,

రుద్రానుగ్రహం ఉండాలి. రుద్రుడి అనుగ్రహం ఉంటేనే తపస్సు చేయగలవు. సృష్టిలో మొట్టమొదటి తపస్వి రుద్రుడే. అతడినే 'ఆదియోగి' అంటారు. 11 మంది రుద్రులుగా అంతటా నిండిపోయి పనిచేసి పెట్టేసి చీకటిని అంతా తీసేసి తరువాత ఏమిటి పని అని అడుగుతాడు బ్రహ్మదేవుని. బ్రహ్మదేవుడు అంటాడు నేను చెప్పేంతవరకు నీవు తపస్సు చేసుకుంటూ ఉండు. నమస్కారం! అంటాడు. సృష్టి నిర్మాణానికి రుద్రుడే! సృష్టి నిర్మూలనమునకూ రుద్రుడే! (Ground clearance కి ఆయనే, total dismantling కి ఆయనే రావాలి.) ఇన్నింటిలోంచి ఒక్కసారి ఆయన శక్తిని ఉద్భవింప చేస్తాడు. అంతటా తరంగములుగాను, శబ్దముగాను, వెలుగు గాను గోచరిస్తాడు.

*"యో రుద్రో అగ్నౌయో అప్సుయ ఓషధీషు,*
*యో రుద్రో విశ్వాభువనా వివేశ తస్మై రుద్రాయ నమో అస్తు."*

అంతటా వ్యాప్తి చెందిన నీకు నమస్కారం. పరిపూర్ణమైన రుద్రమంత్రం అదే! రుద్రమంత్రం వేరు, మృత్యుంజయ మంత్రం వేరు. రెండు తత్త్వాలు ఒకడివే. "నాకుగా నేను దేహం నుంచి వచ్చేస్తాను అనుకునేంత వరకూ నా దేహం నుంచి నన్ను విడదీయకు" అని కోరుకునేది ఒక మంత్రం. "నేను కోరుకోకుండా నన్ను తీసివేస్తే నాకు విపరీతమైన బాధ, నొప్పి కలుగుతాయి. లక్ష తేళ్ళు ఒక్కసారి కుట్టినంత నొప్పి కలుగుతుంది. అందుకని అలా జరగకూడదు. నాకుగా నేను ఎప్పుడు వెళ్తాను? నేను ఇందులో పండితే వెళ్తాను. పండినంత వరకూ నన్ను తుంపకు." అనేది ఒకటి. దోసతీగ ఆధారంగా దోసపండు బాగా పండిన తరువాత

అలా ముట్టుకుంటే చేతికి వస్తుంది. తీగకు, పండుకు బాధ లేదు. అంతలా "పండేంతవరకూ నన్ను దేహంలో ఉండనీ సుమా! నన్ను చంపివేయకు. నువ్వే మృత్యువుకు అధిదేవతవు."అని.

ఎందుకంటే అందులో 3 సార్లు "రుద్ర" అని వస్తుంది. 11 రుద్రులకు కలిపి 11 సార్లు ఈ మంత్రం చేసుకున్నా చాలు. ఇలా 11 గా చెప్పుకొస్తారు రుద్రసూక్తంలో కూడ. *"ఓం నమస్తే అస్తు భగవన్ విశ్వేశ్వరాయ, మహాదేవాయ, త్ర్యంబకాయ, త్రిపురాంతకాయ, త్రికాగ్నికాలాయ, కాలాగ్ని రుద్రాయ, నీలకంఠాయ, మృత్యుంజయాయ, సర్వేశ్వరాయ, సదాశివాయ, శ్రీమన్మహాదేవాయ నమః"* అవన్నీ 11 ఉంటాయి. శ్రద్ధ, రుచి ఉంటే చాలా కనిపిస్తాయి. శిరస్సు నుంచి పాదాలదాక ఉంటాడు మనలో. అలాగే 11 రకాల తరంగములతో మొత్తం సృష్టి అంతా వ్యాప్తిచెంది ఉంటాడు. ఆ తరంగములు ఉండడం వలనే శబ్దం వినిపిస్తుంది. ఆ తరంగములు ఉండడం వలనే సూర్యకిరణం వ్యాప్తి చెందుతున్నది. ఆ తరంగములు ఉండడం వలనే జీవునిలో మార్పులు కలుగుతూ ఉంటాయి. ఆ తరంగములు ఉండడం వలనే ప్రాణం పనిచేస్తుంది. ఆ తరంగములు వలనే స్పందనం కలుగుతుంది. ఎక్కడ కదలిక ఉండాలంటే అక్కడ శివుడు ఉండాలి. కదలిక శివుడు. తరంగములను vibrations అంటారు ఆంగ్లములో.

విశ్వ తరంగముల (Cosmic Vibrations) నుంచి గ్రహతరంగముల (Planetary Vibrations) వరకు అణువులో కదలిక వరకు మొత్తం వ్యాప్తిచెందిన దానిని వేదంలో

రుద్రుడు అంటారు. శివుడన్న పదం వేదములో కనిపించదు. రుద్రుడన్న పదం కనిపిస్తుంది. ఆకాశం ఆయన మూలంగానే వెలుగుతున్నది. రుద్రుల వలననే రోదనము (Vibration) పుడుతుంది. వీరి కారణముగా ఆకాశము రోదసి (Ether) యగుచున్నది. ఆకాశము మూడు స్థితులలో ఉన్నది. పరాకాశము, మహదాకాశము, మనమెరిగిన పంచభూతములలోని ఆకాశము. అదియే అవరోహణ క్రమము. నిజమునకు అంతా ఆకాశమే. మూడు ఆకాశములు, నాలుగు భూతములు లోకములుగా ఏర్పడి యున్నవి. రుద్ర రోదనము వలననే రోదసి అంతా ప్రచోదనము చెందుతున్నది. రోదనము వలన తరంగములు పుట్టి, తరంగముల నుండి శబ్దము, వెలుగు, స్పందనములు పుట్టుకుని వస్తాయి. కనుకనే అంతరిక్ష దేవతలలో అగ్ని స్వరూపుడైన రుద్రుడు ప్రధానముగా కొలువబడుతూ ఉంటాడు. రుద్రుడు సృష్టిక్షేత్రము ఏర్పాటు చేయగా అందు లోకములను, లోకులను, లోకపాలకులను బ్రహ్మదేవుడు ఏర్పాటు చేస్తాడు. రుద్రుడు ఏకాదశ రుద్రులై క్షేత్రమును ప్రచోదనము చేయుటతో సృష్టికథ కొత్త ఘట్టానికి చేరుకుంటుంది. ఈ రుద్ర తరంగముల కారణముగా సూర్యుడు, చంద్రుడు, అగ్ని, ఆకాశము, వాయువు, జలము, పృథ్వి పుట్టుచున్నవి. అంతకు ముందున్న ఆకాశం గర్భితం కాదు. రుద్రుని మూలంగా ఆకాశం వెలుగవుతున్నది. ఆకాశం నుంచి పంచభూతములు పుట్టుకొస్తాయి. సూర్యుడు, చంద్రుడు వెలగడానికి కారణం రుద్రుడే. మనలో పంచభూతములు బాగా పనిచేయాలన్నా, ప్రాణం బాగా పనిచేయాలన్నా రుద్రుడే.

ఆత్మ తత్త్వమే సూర్యుడు, మనస్సే – చంద్రుడు, ఆకాశం – విశుద్ధి, వాయువు – అనాహతం, అగ్ని – స్వాధిష్ఠానం, జలం – మణిపూరకం, పృథ్వి – మూలాధారంలో ఉంటాయి. ఇవన్నీ సరిగ్గా పనిచేయాలంటే రుద్రుడు కావాలి. తరంగములు తరంగములుగా అంతా వ్యాప్తి చెంది ఉంటాడు. ఈ తరంగములు మూలంగా ప్రాణం పుడుతుంది. ఇందు అగ్ని యొక్క ప్రభావమున సూర్యచంద్రుల యస్తిత్వము నుండి స్పందన, ప్రాణము (Pulsation) పుట్టుచున్నవి. ఇది ఉచ్ఛ్వాస నిశ్వాసాత్మకము. దీనిలో పై చెప్పిన పంచ భూతములు కలిసి దేహ మేర్పడుతుంది. అందు తపస్సు పుడుతుంది. ఈ అగ్ని ప్రభావమున వేడి పుడుతున్నది. పుట్టిన దేహానికొక కేంద్రమేర్పడి, దానియందున్న ప్రజ్ఞ హృదయముగా ఏర్పడుతుంది. తపస్సు చేస్తే వేడి పెరుగుతుంది. తపస్సుకి విశ్వామిత్ర మహర్షినే చెప్పుకోవాలి. విశ్వామిత్ర మహర్షి చేసిన తపస్సు వలన భూమి అల్లకల్లోలం అయింది. ఆ తపస్సు యొక్క ప్రకంపనలు మూడులోకాలు దాటిపోయాయి. అన్ని లోకాలు దాటిపోయి ఇంద్రుడి సింహాసనం కూడా కదలడం మొదలుపెట్టింది. హనుమంతుడు మహేంద్రగిరి పర్వతం నుంచి లంక చేరడానికి గట్టిగా 3 సార్లు గాలి పీల్చి లంఘించడానికి సంకల్పం చేస్తాడు. ఆ వేడికి మహేంద్రగిరి పర్వతం గజగజ వణకింది. చెట్లు మాడిపోతాయి. అలాగే Master C.V.V.గారు యోగం చేస్తూ ఉంటే వేడి పుడితే మజ్జిగ తాగండి, అని చెప్పారు.

రుద్రులవలన రోదనం పుడుతుంది. లోపల తరంగములు ఉంటాయి. తరంగముల వలనే ప్రాణం పనిచేస్తుంది. ప్రాణం

బాగా లేకపోయినా, పోతుందన్నా రుద్రాభిషేకమే ఉపాయము. సూర్యుడు కుడికన్ను, చంద్రుడు ఎడమకన్ను, అగ్ని మూడవ కన్నుగా మనలో ఉంటారు. ఈ మూడూ ఉండడం చేత మన లోపల ఆకాశం వెలుగుతూ ఉంటుంది. బయట ఆకాశం అలాగే వెలుగుతుంది. చంద్రుని వలన రాత్రి, సూర్యుని వలన పగలు. ఈ రెండూ వెలగడానికి కారణం అగ్ని. అగ్ని రుద్రుడే! మూడవకన్ను నుంచి రెండవకన్ను, మొదటికన్ను వెలిగించడమేకాక మనలో ప్రకంపనలు కలిగించడం, ప్రాణం ఏర్పాటు చేయడం, పంచభూతములు ఏర్పాటు చేయడం ఇవన్నీ జరుగుతాయి. మనలో సాధారణంగా వేడి ఉంటుంది. దీనికి రుద్రుడే కారణం. శరీరం చల్లబడుతున్నదంటే రుద్రమే చేయాలి. శరీరం చల్లగా ఉండేవారు, బద్ధకస్తులు రుద్రం చేసుకుంటే తమస్సు పోతుంది. తమస్సు, బద్ధకం పోవాలంటే శివారాధన చేయాలి. అదికూడా రుద్రసూక్తంతో చేస్తే పటాపంచలవుతాయి. మలినములు పోతాయి. ప్రాణానికి శక్తి వస్తుంది. మనలో పంచభూతములకి పదను కలుగుతుంది. తెలిసి చేయాలి. తెలియక చేస్తే నీరసం వస్తుంది. అందుకనే లఘున్యాసం, మహాన్యాసంలో ఎక్కడెక్కడ రుద్రుడున్నాడో మనం స్పృశిస్తూ ఉంటాము. ఒంటినిండా ఆయనే ఉన్నాడు అనుకుంటే బాగుచేస్తాడు. బాగా అనాలి, బాగా వినాలి. అందుకని "స్వస్తి" లాగా చదువుతాము. ఒకళ్ళు అంటే ఇంకొకరు వింటారు. వినడం, అనడం రెండూ ఉంటాయి. మనకు అలసట ఉండదు. లేకపోతే అరవడమే మిగులుతుంది. చందోబద్ధంగా ఒకరు, ఇంకొకరు చదివితే 33 సార్లు చదివినా ఆయాసం ఉండదు. 33 సార్లు అంటే ముందే భయం మనకు ఆకలి

వేస్తుందని. అసలు రుద్రం చదివితే ఆకలి వేయదు. కొంతమంది రాత్రంతా అధ్యయనము చేస్తారు. మధ్యమధ్యలో ప్రక్కకి వెళ్లి పులిహోర తినడం, మంచినీళ్ళు త్రాగడం, ఇవి ఉండవు. లోపల ఆయనే ఉన్నాడుగా! 11 మంది రుద్రులు శరీరమంతా వ్యాపించి ఉండగా మాటిమాటికి దేహానికి ఆకలి, దాహం, నిద్ర ఉండవు. ఆయన తపస్సు చేసుకుంటూ ఉంటాడు. నెమ్మదిగా 11మంది రుద్రుల పేర్లు తెలుసుకుని, వాటిని స్థిరపరచుకుంటే మనం ఎక్కువ బాగుపడే అవకాశం ఉంటుంది. ఏదో సమాచారం (information) పోగేసుకోవడం కాదు. ఒకసారి చదివాము అంటే లోపల జీర్ణం కావాలి. నెమరువేసుకుంటూ ఉంటే మనలో రుద్రుడు ఉన్నాడని తెలుస్తుంది. ఇంక మనకు భయం ఉండదు. అలాంటి రుద్రుడు మనకు పరిచయ మవుతున్నాడు భాగవతంలో. పంచభూతముల వలన, సూర్యచంద్రుల వలన దేహమున పంచేంద్రియములు ఏర్పడుతున్నాయి. సూర్యాగ్నుల వలన కన్నులు, చంద్రుని వలన మనస్సు, గాలి వలన స్పర్శ, నీటి వలన రుచి చూచుట, ఆకాశము వలన శబ్దము వినుట, పృథివి వలన వాసన తెలియుట ఏర్పడుతున్నాయి. ఈ విధముగా రుద్రులు పదకొండుగురు భూతసృష్టికి కారకులై తమ స్థానములను ఆక్రమించారు. కనుకనే రుద్రులలో ముఖ్యుడైన శంకరుడు భూతగణముల కధిపతియని చెప్పబడినది. ఇందేర్పడిన సూర్యాదులు ధర్మములు (Principles). గోళములు కావు. అన్నింటిలో స్పందనాత్మకంగా ఉంటాడు. అన్నింటిలోనూ వేడిమిని కలిగిస్తూ ఉంటాడు. అన్నింటిలో ప్రాణాన్ని కలిగిస్తాడు. జీవుడిగా దిగివచ్చినపుడు ప్రతి కణంలో వేడిగా ఉంటాడు. కణంలో వేడి

తగ్గితే ప్రాణం తప్పుకుంటుంది. ఒక కణం చచ్చిపోతే ప్రక్క కణాన్ని చంపేస్తుంది. రక్తవ్యాధి (Cancer) పుట్టుకొస్తుంది. మనలో ఏ కణం చావకుండా రక్షింపబడాలని ఇవన్నీ ఏర్పాటు చేశారు. ఈ వ్యాప్తి చెందిన దేవతలతో మనం అనుసంధానం చేసుకుంటే కొన్ని కొన్ని మన దరిచేరవు.

భూతముల దేహములలో కూడా రుద్రులు స్థానములుగొని ఉన్నారు. ఐదు జ్ఞానేంద్రియములు, ఐదు కర్మేంద్రియములు, మనస్సు అనేవి పదకొండు స్థానములు. గనుక జీవుడు పుట్టిన వెంటనే రోదనము చేస్తాడు. ఈ రోదనము వలననే వారతనిని ఉచ్ఛ్వాస నిశ్వాసములు చేయించి ప్రాణప్రతిష్ఠ, నాదప్రతిష్ఠ చేస్తారు. అటుపైన జీవుడు ప్రాణముతో దేహమున జీవిస్తాడు. నాదముతో ఇతరులతో సంభాషిస్తాడు.

సృష్టిలో అసుర (చీకటి) భావనలు, సుర (వెలుగు) భావనలు రెండూ ఉన్నాయి. చీకటి దారులలో నడిచే సంకల్పాలు, వెలుగుదారులలో నడిచే సంకల్పాలు వస్తాయి. ఎందుకంటే ఆత్మ పరమాత్మతో అనుసంధానం చెందితే ఒక రకమైన మార్గము తెరువబడుతుంది. పరమాత్మ ఆత్మగా వచ్చినప్పటికీ, ప్రత్యేగాత్మగా ఉన్నపుడు ఒక రకమైన భావనలు తన నుంచి వ్యక్తమౌతాయి. అదే భక్తుల కథలకు మిగతా వాళ్ళ కథలకు తేడా! భక్తుల కథలలో భగవద్భావమే నడుస్తూ ఉంటుంది. మనం కాసేపు అహంకారంలో ఉండి నిర్ణయం చేస్తూ ఉంటాము. అది జీవితాంతం ఇబ్బంది పెట్టవచ్చు. నారాయణుని యందు చిత్తం కలిగి ఉన్నప్పుడు బ్రహ్మదేవుని నుంచి మరియొక సృష్టి జరిగింది.

(సనకసనందనాదులు, రుద్రులు) నారాయణుని యందు లేనపుడు అవిద్యా పంచకం వచ్చినది. సంకల్పము ప్రధానము. సంకల్పం నీది కాదు. ఈ రహస్యం మరిస్తే కథ ఒకటి. ఈ రహస్యం మరవకపోతే కథ ఒకటి. మరవని వారి కథలున్నాయి. మరిచినవారి కథలున్నాయి. అపుడపుడు మరిచినవారి కథలున్నాయి. ఎక్కువగా మరిచిపోయినవారి కథలున్నాయి. మరిచినవారి కథలు అసురకథలు. ఇలా నాలుగు రకాల కథలున్నాయి.

బ్రహ్మదేవుని నుంచి వచ్చిన సంకల్పం బ్రహ్మది కాదు బ్రహ్మముది. బ్రహ్మము యొక్క సంకల్పమే బ్రహ్మదేవుని నియమిస్తుంది. బ్రహ్మము యొక్క సంకల్పానికి బ్రహ్మదేవుడు అనుసంధానం చెందాలి. నీవు నారాయణునితో కూడి ఉంటే వెలుగుభావాలు దిగివస్తూ ఉంటాయి. పనులు, జీవితం అపుడు నిరాటంకంగా సాగుతూ ఉంటుంది. అసురభావాలు వస్తే అన్నీ అడ్డంకులే! అన్నీ ఇబ్బందులే! ఎంత బాగా దైవంతో ముడిపడి ఉన్నాము అన్నది ప్రశ్న.

ప్రారంభంలోనే చదువు పూర్తయి ఉద్యోగంలో చేరగానే పెళ్లి చేసుకుని, పిల్లల్ని కని, ఇల్లు కట్టి, పుట్టినవారందరికి పెళ్ళిళ్ళు చేసి--, ఇవన్నీ 40 సంవత్సరాలలో ఎలా చేస్తాం? అనుకుంటే అప్పుడే చతికిలబడతారు. మనది కాదు భావన అనుకున్నవాడు సుఖపడతాడు.

ఇంట్లో ఒకే దూరదర్శిని (TV) ఉంటుంది. భక్తి channel ఉంటుంది. Sports channel ఉంటుంది.

Cinema, Cartoon channels అన్నీ ఉంటాయి. నువ్వు ఏ channel కోరితే ఆ channel open అవుతుంది. చిత్తానికి భాగవతాది గ్రంథాలకు channel open అయిందనుకోండి అది నడుస్తుంది. రాజకీయాలకు, ఆస్తిపాస్తులకు channel open అయిందనుకోండి, ఆ channel కు అలవాటుపడిన చిత్తం మరియొక channel కు అలవాటు పడాలంటే చాలా చాలా కష్టం. అవునా కాదా! దైవము కాలాన్ని, దేశాన్ని బట్టి నీకు వడ్డించేస్తాడు. మినపట్టు వాడికి మినపట్టు, పెసరట్టు వాడికి పెసరట్టు, రవ్వ అట్టు వాడికి రవ్వ అట్టు, కొంతమందికి మాడిన అట్లు, కొంతమందికి పుల్లట్లు. తినేవాడి స్థితిని బట్టి వండడం. భాగవత తత్త్వం ఎంత సుళువు? ఊరికే పొరపాట్లు చేసుకుంటూ ఉండే బదులు ఎందుకొచ్చిన గోల! దైవంతో కూర్చుంటే పోయె! ఆ channel లో అలా వెళ్ళిపోతూ ఉండవచ్చు. ఆ channelలో ఘర్షణలు ఉండవు. మిగతా channels అంతా ఘర్షణలే! అది తెలుసుకున్న వారు తెలిసిన వారు. Other channels are no channels. This is the channel in which all channels are included in it. ఇదీ భాగవతం. పురాణం వినడం ఒక పద్ధతి, రహస్యాలు తెలియడం ఒక పద్ధతి.

రుద్రుడు వస్తే చీకటి ఉండదు. రుద్రతత్త్వ స్మరణ ఉంటే నిన్ను ఎవరూ ముట్టుకోరు. చీమ, దోమ, పాము, దేవతలు, రాక్షసులు, అందరికీ భయమే రుద్రుడంటే. బ్రహ్మదేవునికి కూడా భయమేసింది. బ్రహ్మదేవుని ఫాలభాగంలోంచి రుద్రుడు వచ్చాడు. మనకి ఫాలభాగంలోనే ఉంటాడు. 11 స్థానాలలో దేహమంతా

నిండిపోయి ఉంటాడు. ఒంట్లో ప్రసారం నీరసించినా రుద్రనమకం చేసుకోవాలి.

వినబడడం లేదనుకోండి *'ఓం నమఃశివాయ'* మంత్రం చేసుకోవచ్చు. పంచేంద్రియాలు బాగా పనిచేయాలంటే పంచాక్షరి పట్టుకోవాలి. ఇంద్రియములకు అధిపతి రుద్రుడు. మనస్సుకు, హృదయానికి అధిపతి. అంతా వ్యాప్తి చెందుతాడు. ఆదిత్యుడి వెలుగుకు కదలిక రుద్రుడు. అలా ఉంటుంది. పురాణాలలో కథలకు, వేదములో అవగాహనకు చాలా తేడా ఉన్నది. అందుకని సందర్భము (context)ను బట్టి అర్థం చేసుకోవాలి. పుట్టిన పిల్లవాడు కూడా పుట్టంగానే ఏడవకపోతే శరీరమంతా తరంగాలు వ్యాప్తి చెందవు. ఒక వేళ ఏడవకపోతే లాగి ఒక్కటి పిర్రమీద వేస్తారు ఏడవాలని. కెవ్వున మొదలుపెట్టి ఏడుపు నేర్చుకుంటాడు. ఎంత ఏడిస్తే అంత బలం. *"బాలానాం రోదనం బలం"* ఏడవంగానే పాలు పట్టడం కాదు. ఏడవనీయండి, ఫరవాలేదు, అని చెప్పాలి. పుట్టంగానే ఎంత ఏడిస్తే, రుద్రుడు 11 స్థానాల్లో అంత ఆక్రమిస్తాడు. రుద్రనమకం చదివితే శరీరమంతా విపరీతంగా vibrations. చదువుతుంటే ఆవలించేవాడు చాలా దురదృష్టవంతుడు. నిద్ర రాదు. మొత్తం అంతా మెలకువే. అందుకే శివజాగరణలో నిద్ర రాదు. మత్తు అనే ప్రశ్నే లేదు. రుద్రుడుంటే అలాంటి విపరీతమైన ప్రకంపనలు ఉంటాయి.

ఈ విధంగా 11 మంది రుద్రులు భూతసృష్టికి కారకులై తమ స్థానములను ఆక్రమించారు. కనుకనే శంకరుని భూతగణములకు అధిపతి అని చెప్పబడింది. పుట్టడం, పెరగడం

కావాలంటే రుద్రుడు కావాలి. సూర్యప్రజ్ఞ, చంద్రప్రజ్ఞ ఉంటేనే పుట్టుక. వర్షం పడాలంటే రుద్రాభిషేకం, అతిరుద్రయాగం అని చేస్తారు కదా! యాగం చేస్తే శివుడిని పిలవకుండా దక్షుడికి ఏమీ స్పందన ఉండదు. సృష్టికి దేహం, జీవునకు దేహం ఏర్పడడానికి ప్రాతిపదిక రుద్రుడు. భూతములు ఏర్పడడానికి ప్రాతిపదిక కాబట్టి భూతనాథుడయ్యాడు. పుట్టేవన్నీ భూతాలే. (భూత, ప్రేత పిశాచాలలో భూతములు కాదు). జంతువులు భూతాలే! 11 స్థానాలలో ఉన్నాడు. *'సద్యోజాతాయవై నమో నమః'* అంటే ఠక్కున ఆవిర్భవించడం (lightening). *'సద్యోజాతం ప్రపద్యామి'* అని షోడశోపచార పూజ మొదలు పెడతాం కదా! నిన్ను శరణు పొందుతున్నాను. నిన్ను వేడుకుంటున్నాను అని చెప్పడం. *"సద్యోజాతాయ నమో నమః"* అనగానే ఒక్కసారి పదకొండుమంది రుద్రులు శిరస్సునుంచి పాదాల దాకా ఠక్కున ప్రచోదనం చెందుతారు. సద్యోఫలితం అంటే తెలుసా! అడగంగానే అయిపోతుంది. అడగడం, అవడం ఒకేసారండి. అదీ రుద్రుడు అంటే!

## 3. ఏకాదశ రుద్ర నామములు - శక్తులు

ఈ 11 మందికి బ్రహ్మదేవుడు నామకరణం చేస్తున్నాడు. పదకొండు స్థానముల యందు, పదకొండు రూపములు ధరించిన రుద్రుని మూర్తులతో బ్రహ్మదేవుడు ఇట్లనెను : కుమారులారా! మీ పదకొండుమందికి నామకరణము చేయుచున్నాను. మీ పేర్లు వరుసగా :

1. మన్యువు
2. మనువు
3. మహాకాలుడు
4. మహత్తు
5. శంకరుడు
6. ఋతధ్వజుడు
7. ఉరుడు
8. రేతోభవుడు
9. కాలుడు

10. వామదేవుడు

11. ధృతవ్రతుడు.

వీరియందలి గుణములే రుద్రుల భార్యలుగా వర్ణింపబడ్డాయి. మీ భార్యలతో గూడా పదకొండు రూపములతో, ఆ యా పేర్లతో, ఆ యా నివాసములలో వసించమని బ్రహ్మదేవుడు వారి పేర్లను తెలియజేశాడు. వారి పేర్లు వరుసగా

1. ధీ
2. వృత్తి
3. అశన
4. ఉమ
5. నియుత్
6. సర్పిస్సు
7. ఇల
8. అంబిక
9. ఇరావతి
10. సుధ
11. దీక్ష.

**వారి భార్యలు/ గుణములు :**

1. ధీ – ధరించునట్టి బుద్ధి కేంద్రము (Will Centre).
2. వృత్తి – ప్రవర్తన కేంద్రము (Behaviour Centre).
3. అశన – తినుట లేక ద్రవ్యమును శక్తిగా మార్చుట (combustion).
4. ఉమ – కాల విరామము లేక కాల విభాగము (Pause).
5. నియుత్ – నియోగింపబడు శక్తి (Channelaization).
6. సర్పిస్సు – నేయి లేక శుక్ర ధాతువును పుట్టించు ప్రజ్ఞ.
7. ఇల – పరిమితి లేక పరిణామము (Measure).
8. అంబిక – గర్భము ధరించు శక్తి (Fecundity).
9. ఇరావతి – మెఱపు తీగె లేక స్ఫురించు శక్తి (Intuition).
10. సుధ – చక్కగా ధరించునది లేక అమృతము. ఇది సంతోషమనబడు శక్తి (Joy).
11. దీక్ష – నిరంతరత్వము వహించు శక్తి (Purpose of continuity).

## 1. మన్యువు - ధీ :

**నమస్తే రుద్ర మన్యవ :** మన్యువు అంటే సృష్టిలో అతను సంకల్పం చేస్తే తిరుగు లేదు. *"తన్మే మనః శివ సంకల్పమస్తు"* "నువ్వు మా యందు ఎప్పుడూ కరుణతో అనుగ్రహంతో కూడిన భావనతో ఉండు. మా మీద మరొక భావన వద్దు సుమా!" అని కోరుకుంటూ ఉంటాము రుద్రుడిని. రుద్రుడు బాణం ఎక్కుపెడితే సృష్టి ఆగలేదు. రుద్రుడు దిగడు. రుద్రుడిని నీవు మాకు ఉన్ముఖుడవై మమ్మల్ని కాపాడేవాడుగా ఉండు అని కోరుకుంటాము. "మన్యుసూక్తం" అని ఒకటి ఉంది. మనలో భయంకరమైన పట్టుదలలు వస్తాయి కదా! మనిషి తాను నాశనమవుతున్నా తన పట్టు వదలనివాడు మూర్ఖుడు. ఎవడిమీద అయినా వివాదము (dispute) వచ్చిందనుకోండి, అది శాశ్వతంగా అలాగే ఉంటున్నది. జీవితమే శాశ్వతం కాదు. ఎవరైనా నచ్చిన తరువాత క్రమక్రమంగా నచ్చకపోవడం జరుగుతుంది. ఒక మనిషి నచ్చకపోవడం అన్నది జరిగిన తరువాత నచ్చడం జరుగుతుందా? అలా జరగకుండా ఉండాలంటే రుద్రుడు కావాలి. మంచివాడైనా మనకు నచ్చలేదనుకోండి, మనకు మంచిది కాదు. మన్యుసూక్తం చదువుకుంటే అజ్ఞానపూరితమైన పట్టుదల లేకుండా చేస్తాడు. ఒకరితో మాట్లాడలేదు అంటే జన్మంతా అలాగే ఉంటుందిగా, ప్రతివాడికీ అది గొప్పా! పొరపాటు నీవు చేయవా? సృష్టిలో ఎవడు చేయడు? క్షమించగలగడం ఒకటి ఉంటుంది. క్షమించవచ్చుగా? క్షమించని గుణం ఉన్నదనుకో పాడైపోతావు. ఎదుటివాడి ప్రవర్తనలో మార్పు వచ్చినపుడు క్షమించాలి. ఇప్పుడైనా సీతను అప్పచెప్పు నిన్ను క్షమిస్తాను, అంటాడు రాముడు. ధర్మరాజు

కూడా అంతే! దుర్యోధనునితో ఇపుడైనా సంధి చేసుకుందాం, అంటాడు. ఎప్పుడు? ఎదుటివాడిలో పరివర్తన వచ్చినపుడు. పరివర్తన రాకపోతే వేరే సంగతి. దక్షుడి విషయంలో మారేవరకు శివుడు అలా నిలబడిపోతాడు. దక్షుడు మంచి సమర్థుడు. మంచి సమర్థుడు అహంకారి అయ్యాడు. శివుడు వానియందు మౌనం, నిర్లిప్తతగా ఉంటాడు. అదీ శివుడు! తప్పులు ఇంకా చెయ్యి, ఇంకా చెయ్యి. ఏం మాట్లాడడు. ఎంతమంది చెప్పినా వినని స్థితిలో ఏమిటేమిటో పేలుతూ, తన భార్యను కూడా అవమానపరచిన సందర్భంలో శివుడు ఒక్క వెంట్రుక తీసి "వీళ్ళనందరినీ చూడరా" అంటే దక్షుడి తలకాయను శూలంతో పొడిస్తే వెళ్ళి యజ్ఞకుండంలో పడి భస్మమైపోతుంది. శివుడు నిరహంకారి. అమాయకులకు ఎంత లొంగుతాడో, అహంకారులకు అంత లొంగడు. దైవతత్త్వమే అంత. మన్యువు అంటే తిరుగులేని సంకల్పం.

**ధీ శక్తి:** సంకల్ప శక్తి ఎవరియందు బాగా ఉంటుందో వారికి కార్యముల యందు పట్టుదల ఉండడం చేత ఆ కార్యనిర్వహణలో పరిపూర్ణ సమర్థత కలిగి ఉంటారు. దానినే "శివధనుస్సు" అని చెప్తూ ఉంటారు. శివుని యొక్క మన్యువు అతి తీవ్రమైన ధీశక్తి కలిగినటువంటిదిగా తెలియపరుస్తారు. ధీశక్తి ప్రతివారికి చాలా అవసరము. దానికే రుద్రాభిషేకం ప్రత్యేకంగా చేసుకోవడం జరుగుతూ ఉంటుంది. *ధియోయోనః ప్రచోదయాత్!* "*నమః శివాయ!*" చేసుకుంటే ధీశక్తి పెరుగుతుంది. ఒకే పనిని ఒకే రకంగా చేసుకోవడం, ఎపుడూ చేయగలగడం స్వభావముగా ఉంటుంది. ఒక కార్యం జరగాలంటే అది సకాలంలో ఒకే సమయమునకు చేసుకుంటూ వెళ్తే ఆ పని అయిపోతుంది. ఒకరోజు చేసి, ఒకరోజు

చేయక, ఒకరోజు పాల్గొని, ఒకరోజు పాల్గొనక, అలా ఉంటే రుద్రుని ఆరాధన చేస్తే క్రమమును, నిరంతరత్వమును (regularity) ఇస్తాడు. మరచిపోవడం ఉండదు. మరచిపోయాను మాస్టారూ! అని అనరు. చెప్పినది చెప్పినట్లు గుర్తుంటుంది. చెప్పినది చెప్పినట్లు చేస్తారు. అందుకని చిన్నప్పటినుంచి *"ఓం నమః శివాయ!"* అనే మంత్రం ఇచ్చారు బాగుపడతారని. ప్రొద్దున్నే స్నానం చేయడం అలవాటు అనుకోండి, వాడు జన్మంతా అలాగే స్నానం చేస్తాడు. స్నానం చేయకుండా బయటకు రాడు. ఇలాంటి కట్టుబాటు యిస్తాడు.

## 2. మనువు - వృత్తి :

మానవజాతికి మూల విరాట్ మనువు. ఒక్కొక్క కాలానికి ఒక్కొక్క మనువు ఉంటాడు. మొత్తం 14 మంది మనువులు ఉంటారు. ప్రస్తుతం వైవస్వత మనువు. అంతకుముందు చాక్షుష మనువు, అంతకుముందు రైవత మనువు, అంతకుముందు తామస, అంతకుముందు ఉత్తమ, అంతకుముందు స్వాయంభువ మనువు, తరువాత వెలుగులోకాలకి సంబంధించిన జాతి పుట్టుకొస్తుంది. అది మనమే! సావర్ణి మనువులు. ఈ మన్వంతరం అయిపోతే మనం క్రమంగా వెలుగు శరీరాల్లోకి ప్రవేశిస్తాము. సావర్ణి మనువు అంటే రకరకాల రంగుల లోకాల్లో ఉంటాము. మొట్టమొదటిది Violet. CVV అంటే Cosmic Violet Vibration అని ఈ మధ్యనే తెలిసింది. అందరూ నెమ్మదిగా ఈ జాతిని బాగుచేద్దామని పై లోకాల నుంచి దిగి వచ్చేస్తున్నారు. ఊర్ధ్వలోక ప్రవేశ సమయము అంటే అందరూ ఎగబడతారు కదా! వైవస్వతమనువు, వివస్వతుడు

అనే సూర్యుడికి పుట్టినవాడు. వివస్వతుడు, వైవస్వతుడు అంటే లుంగలు తీస్తూ ఉంటారు భావాలలో. పత్తిలోంచి నూలు దారాలు అల్లిక చేస్తూ ఉంటారు కదా! అల్లిక చేసే మనసు!

*"ఇమం వివస్వతే యోగం ప్రోక్తవా నహ మవ్యయమ్,*
*వివస్వాన్ మనవే ప్రాహ మను రిక్ష్వాక వేஉబ్రవీత్."*

ఇపుడు వైవస్వత మన్వంతరము. మనువు రూపంలో ఉండేది రుద్రుడు. ఈ జాతిని అల్లిక చేస్తూ మనువు ఉంటాడు. ఒక మనువు కాలంలో 7 రకాల జాతులు నిర్మాణం అవుతాయి. వాని పరిణామం ఒక కథగా నడుస్తుంది. ఒక మన్వంతరం అంటారు. ఆయన కార్యక్రమం ఆయన చక్కగా నిర్వర్తించి, తరువాత మనువుకు ఈ కార్యక్రమాన్ని అప్పచెప్పడం ఉంటుంది. అలా 14 మంది మనువులు ఉన్నారు. ఈ మనువుల కార్యక్రమం శక్తివంతంగా నడపడానికి ఒక రుద్రుడు ఆధారం. మనువు అంటే వైవస్వతమనువు అని కాదు. 14 మంది మనువులు సృష్టిని అనుసరించి 14 శుక్ల కళలుగా సృష్టి విప్పారడం, పూర్ణసృష్టి ఏర్పడడం, 14 కృష్ణపక్ష తిథులుగా తిరోధానం చెందడం. ఒక మాసములో చంద్రుడు వృద్ధి క్షయములుగా ఉంటాడు. అలాగే సృష్టి వికాసం చెందుతూ, చెందుతూ 7 మన్వంతరముల కథ జరుగుతుంది. అలాగే తిరోధానంగా 7 మన్వంతరముల కథ జరుగుతుంది. ఈ 14 మన్వంతరముల కార్యక్రమములను నిర్వహించే శక్తిగా ఒక మనువు ఉన్నాడు.

**వృత్తి:** అనగా బుద్ధిని బట్టి ప్రవర్తనము (or) behaviour. దానిని బట్టి మనిషికి ప్రవృత్తి ఏర్పడుతుంది. దాని నుంచే నివృత్తి

ఏర్పడుతుంది. వృత్తి అంటే ఒక సంకల్పాన్ని ఆధారం చేసుకొని మనం ఒక కార్యక్రమాన్ని చేస్తున్నప్పుడు అది బాగా పెరిగి పెద్దదైన తరువాత అందులోంచి తిరిగి మనం బయటపడాలన్నా కూడా సంకల్పబలం కావాలి. చేసుకుంటూ వెళ్ళిపోవడమే కాదు. చేస్తున్న ఆ వృత్తి లోంచి మరల నివృత్తి కూడా కావాలి. ప్రవృత్తి అని అల్లుకుంటూ పోతూ ఉంటాము. అల్లుకున్న విషయముల యందు మనము చిక్కుకుపోతాము. అల్లుకొనే విషయము ధర్మ సమ్మతం కాకపోయినా, మోహం ఉన్నా బంధింపబడతాము. ఈ వృత్తి తత్త్వము రుద్రుడిది. సృష్టిలో కూడా అల్లుకుపోతూ సృష్టికార్యం చేస్తూ వెళ్ళగలరు. మరలా నివృత్తి. తాను అల్లిన దానినుంచి తానుగా విడిపడడం చేయగలడు. చాలామంది ఉద్యోగం చేస్తూ చిక్కుకుపోతారు. వ్యాపారాలు చేస్తూ ఇరుక్కుపోతారు. మామూలుగా జీవనంలో ఏ కార్యక్రమం చేస్తున్నా ఇరుక్కోవడానికి కారణం స్వార్థమే అయి ఉంటుంది. స్వార్థం ఉన్నచోట సృష్టిలో మనం బందీకృతు లౌతాము. యజ్ఞార్థ జీవనం కొనసాగిస్తూ ఉంటే ఇరుక్కోవడం ఉండదు. యజ్ఞఫలంగా జీవితాన్ని మనం అందుకుంటూ ఉంటే దానివలన మనకి బంధనం కలగదు. దానిమీద మోహపడ్డా, దానిని వశం చేసుకుందాం అనే భావన కలిగినా దానికి మనం వశం అయిపోతాం.

ఈ విధంగా "వృత్తి" అనేది చాలా ప్రధానమైన కార్యక్రమం. "శివారాధన" చేసుకునేవారికి "నివృత్తి" చాలా సులభంగా ఉంటుందని చెప్తారు. ఎందుచేతనంటే ఈ 11 మంది రుద్రులు వారి శక్తిచేత లోకాలన్నీ వ్యాప్తిచెంది, అన్నింటా వెలుగు, శక్తి నింపుతాయి, ఇంక బ్రహ్మదేవుడు "ఇలా మీరు చేసుకుంటూ వెళ్తే

వేడి పెరిగిపోయి అంతా దగ్ధమవుతుంది, అంత శక్తివంతులు మీరు, మీరు తిరోధానం చెందండి" అని అంటాడు. వారు తిరోధానం చెంది తపస్సుకు వెళ్ళిపోతారు. జీవితములో పురోగమనం తప్ప, తిరోధానం తెలియనివారు ఎక్కువగా ఉంటారు. ఎక్కడి నుంచి వెనక్కి తిరగాలి అనేది తెలియాలి.

సృష్టి ఒక పద్మకోశం లాగా వికాసం చెందుతూ ఉంటుంది. ఈ వికాసం చెందే సృష్టిలో మనం అలా పరచుకుంటూ వెళ్ళిపోతే, ముడుచుకుంటూ రావడం కూడా తెలియాలి. మొదటి భార్య పేరు ధీ, రెండవ భార్య పేరు వృత్తి. వృత్తి అంటే ఒకేపనిని ఒకేరకంగా చేసుకుంటూ వెడితే పెరుగుతూ ఉంటాము. పెరుగుతూ అలా ఇరుక్కుపోతాం. ఇరుక్కుపోయినప్పుడు తిరిగి నివృత్తి, అనగా తిరిగి రావడం తెలియాలి. అభిమన్యునికి వ్యూహంలోనికి వెళ్ళడం తెలుసు. వ్యూహం లోంచి బయటికి రావడం తెలియదు అంటే అర్థం ఇదే. జీవితవ్యూహంలోకి ప్రవేశించి, చక్కగా నిర్వర్తించి, అందులో బంధింపబడకుండా మరల తిరిగి రావడమన్న ఒక శక్తి ఉన్నది. అది ఒక రుద్రుడు. అతనినే "మనువు" అంటారు.

ప్రవర్తన జీవులది. వృత్తి ప్రవృత్తిగాను పనిచేస్తుంది, వృత్తి నివృత్తిగానూ పనిచేస్తుంది. రుద్రుడు నివృత్తిని కూడా ఇవ్వగలడు. బ్రహ్మదేవుడు ఇంకచాలు మీ పనులు అంటే ఠక్కున ఆపేసి తపస్సుకు వెళ్ళిపోతారు. ఇంకచాలు అనగానే తపస్సుకు ఎవరైనా వెళ్ళగలరా? రుద్రుడే వెళ్ళగలడు. సృష్టిలో రుద్రుడు మొదటి తపస్వి. విదురుడు ధృతరాష్ట్రుడిని "పాండవులకి జీవితమంతా అపకారము చేశావు, ఇంకా పడి ఏం తింటావు? ముసలి పీనుగకి

పడేయండి అని అంటున్నారు.” అని తిడితే ధృతరాష్ట్రుడు ఠక్కున లేచి వెళ్ళిపోయాడు తపస్సుకు. (మనకు కాళ్ళు, చేతులు పడిపోయి, నానాబాధలు పడుతూ ఇంట్లో వాళ్ళకి పనికి రానప్పుడు) తిండితో పాటు చివాట్లు తింటూ బ్రతకడమన్నది రుద్రశక్తి ఉన్నవాడు చేయడు. కాశీకి ప్రయాణమై ఎక్కడైతే అక్కడ పడిపోతాడు, వెళ్ళిపోతాడు. అంటే నివృత్తి ఉండాలిగా. ఎన్నాళ్ళైనా తెమలక అలా ఉండిపోయాము అనుకోండి, మంచి కార్యక్రమంలో ఉన్న వాళ్లు ఇంకచాలు తపస్సు చేసుకో అంటే ఎవరైనా వెళ్ళగలరా? చేతులు ఆడడం లేదు, చెవులు వినబడడం లేదు, కళ్ళు కనబడడం లేదు. ఇంక ఏం చేస్తాం? తపస్సు చేసుకో. దేహం బాగా పనిచేయడానికి రుద్రశక్తి కావాలి. దేహం క్షీణిస్తున్నది, పనిచేయదు అని అనిపించినప్పుడు ఎవరికి వారుగా తెలుసుకొని అన్నిటియందు వ్యామోహము తగ్గించుకోవాలి. ఇంట్లో ఏదో ఒక గదికి పరిమితమై పోవాలి. లేకపోతే పూర్వకాలం ఇంట్లోంచి వెళ్లిపోయేవారు. వెళ్ళిన 3 రోజుల తరువాత ఇంట్లో వారు మరచిపోతారు, అమ్మయ్య అనుకుంటారు. వానప్రస్థం అంటే దేహాంతం వరకు తపస్సుకు ఉపక్రమించడమే. వృద్ధాశ్రమాలు (Old Age Homes) కట్టుకుంటున్నారు. ఇదీ వానప్రస్థమే. మనం ప్రశ్నలు అడుగుతాం, వైద్య సదుపాయం ఉన్నదా? ఆహారం బాగుంటుందా? తపస్సుకు వెళ్తూ దూరదర్శిని(Television) ఉన్నదా? ఎందుకంటే మనకి cricket matches కావాలి, సినిమాలు కావాలి. ఇది వానప్రస్థం ఎలా అవుతుంది? జీవుడుగా నీవు దేహం నుంచి బయటికి రావడానికి ప్రయత్నం చేయడంకోసం ఒక ప్రదేశానికి వెళ్ళడం వానప్రస్థం. పంచభూతములకి చలించకుండా ప్రకృతి నుంచి ఏమి

వస్తే అది భుజిస్తూ శుష్కింపచేసుకుంటూ దేహము వదిలేయడం సులభం.

చిన్నప్పటి నుంచి రుద్రుని ఆరాధన చేస్తే, చేయడానికి ఎంత ఉత్సాహమో వెళ్ళిపోవడానికి కూడా అంత ఉత్సాహం ఉంటుంది. ఎంత గొప్ప విషయం ? దీనికి ఎవరు? రుద్రుడు. వివేకానందుడు ఎలా వెళ్ళిపోయాడు? మూడు రోజుల ముందు చెప్పేశాడు, గొయ్యి తీయండి, నేను అందులో కూర్చుంటాను, అని. 39 సంవత్సరాలు అతనికి. ఆదిశంకరాచార్యులకు 32 సంవత్సరాలు, జ్ఞానేశ్వర్ కి 21 సంవత్సరాలు. వీరు పనులు చేసేసుకుని, ఇంక ఉండాల్సిన అవసరం లేదు అని వెళ్ళిపోయారు. వీడు ఎప్పుడు వెళ్లిపోతాడా అనుకునే లోపు వెళ్లిపోవాలి. మనము కూడా నిర్ణీత సమయము వచ్చేవరకు ఆరాధనలో ఉండాలి.

**3. మహాకాలుడు - అశన :**

తినడం వలన పెరగడం, క్షీణించడం. మహాకాలుడు అనే రుద్రుడు "అశన" అనే శక్తి కలిగినవాడు. తినడం వలన వృద్ధి చెంది, కొంతకాలము తరువాత తినడం వలన పతనం చెందుతాడు. దేహం పెరగడానికి ఆహారం ఎంత కారణమో, దేహం క్షీణించడానికి కూడా ఆహారం అంతే కారణము. కొంతకాలం ఆహారం మనిషిని పెంచుతుంది, సృష్టిని పెంచుతుంది. పూర్తిగా పెరిగిన తరువాత తినడం తగ్గుతుంది. కాలం రూపంలో సమస్తాన్ని వృద్ధి చేసి, కాలం రూపంలోనే సమస్తాన్ని భక్షించే శక్తి అది. అశనము అంటారు. వృద్ధికి, క్షయమునకు తానే కర్తగా

ఉండి శక్తిగా దిగివస్తుంది. ప్రతి జీవికిని అస్తిత్వం (existence), రూపము(shape), రూపక్షయము(nature) అనేవి కల్పించడం జరుగుతుంది.

అశనము వలననే పెరుగుదల, మరల అశనము వలననే తరుగుదల కాలము ననుసరించి జరుగుతుంది. ఆహార స్వీకరణ వలన వృద్ధి చెందిన రూపము, అటుపైన ఎంత ఆహారము స్వీకరించినను వృద్ధి కలుగదు. వృక్షముల విషయముల యందు, జంతువుల విషయముల యందు, మానవుల విషయముల యందు దీనిని గుర్తించవచ్చు. కాలుని రూపంలో క్రమంగా రూపక్షయం ప్రారంభమవుతుంది. సృష్టి యందు కూడా పై లోకములకు క్రింది లోకములు, క్రింది లోకములకు పై లోకములు ఆహారమై నిలచి, లోకముల నిష్పత్తి చక్కగా నిర్వర్తింపబడుతూ ఉంటుంది. సృష్టి అంతా ఒక మహా అశన కార్యక్రమంగా కాలాన్ని బట్టి నిర్వర్తింపబడుతూ ఉంటుంది. ఇది ఒక మహత్తరమైన కార్యము. భూమి యందలి సారము వృక్షములు తింటూ ఉంటే వృక్షములు పెరగకుండా జంతువులు, మనుష్యులు భుజిస్తారు. అలాగే జంతువుల సంఖ్య పెరగకుండా జంతువులు, మనుష్యులు భుజిస్తారు. మనుష్యుల సంఖ్య పెరగకుండా జంతువులు మనుష్యులను భుజిస్తాయి. మనుష్యుల సంఖ్య పెరగకుండా దేవతా ప్రజ్ఞలు, మానవ ప్రజ్ఞను హరిస్తూ ఉంటారు. అందరినీ కాలం రూపంలో కాలుడు హరిస్తూ ఉంటాడు. సమతుల్యంగా సృష్టి నడవడానికి ఈ రుద్రమూర్తి మహాశనతో కూడి అగ్నికార్యంగా ఈ భక్షణ కార్యక్రమము అప్రమత్తతో నిర్వహిస్తూ ఉంటాడు.

14 మంది మనువులుగా, వాళ్ళ బలంగా, కాలంగా, మహాకాలంగా సెకన్ల ముల్లు, నిముషాల ముల్లు, గంటల ముల్లు ఉన్నది కదా! చిన్న చక్రం నుంచి పెద్ద చక్రం వరకూ కాలుడు, కాలం రూపంలో రుద్రుడు ఉంటారు. అందుకని స్మశానంలో కూడా ఆయనే ఉంటాడు. శివస్థానమే స్మశానం. ఒక cycle అవుతుంది. ఒక చక్రంలో చక్రం, చక్రంలో చక్రం అలా 7 చక్రాలు ఉంటాయి. పెద్ద చక్రం కూడా ఇంకొక చక్రంలో భాగంగా ఉంటుంది. ఆ చక్రం కూడా ఇంకొక చక్రంలో ఉంటుంది. మొత్తం 3 చక్రాలుంటాయి. పెద్ద చక్రంలో 7 చక్రాలుంటాయి. అందులో చిన్న చక్రంలోంచి 7 చక్రాలు వస్తాయి. అందులో చిన్న చక్రం నుంచి మళ్లీ 7 చక్రాలు ఉంటాయి. 3 × 7 = 21 చక్రాల cycle కాలం ఉన్నది. మొత్తం కాలాన్ని మహాకాలం అంటారు. ఇందులో బుల్లి బుల్లి cycles 7 ఉంటాయి. ఇపుడు సూర్యమండలానికి ఒక కాలం ఉన్నది. సూర్యమండలంలో గ్రహాలకి వారి వారి కాలాలు ఉన్నాయి. ఈ సూర్యమండలంలో 7 చక్రాలు, 7 గ్రహాలు ఉన్నాయి. వీరినందరినీ నడిపించేవాడు సూర్యుడు. ఈ చక్రంలో మిగిలిన చక్రాలు తిరుగుతూ ఉంటాయి. ఇక్కడినుంచి సవితృ మండలం. ఇక్కడ ఒక కేంద్రం ఉన్నది. ఆయన 7 చక్రాలలో క్రింది చక్రం మనది. వీరంతా సప్తఋషులు. పెద్ద చక్రాలు. అలాంటి సవితృమూర్తికి ఇంకో పెద్ద చక్రం ఉన్నది. అతను భర్గోదేవుడు. ఇతనిని ఆదిత్యుడు (Cosmic Sun) అంటారు. ఆదిత్యుడు, సవితృడు, సూర్యుడు ముగ్గురున్నారు. సూర్యుని తండ్రి సవితృడు, సవితృడి తండ్రి ఆదిత్యుడు. అనగా సూర్యుడు తండ్రి తండ్రిని ఆదిత్యుడు అంటారు. ఆ పైన అవ్యక్తము, నారాయణం, బ్రహ్మము. ఇక్కడి నుంచి

త్రినాభిచక్రం. మనకి ఒక నాభి. ఇక్కడ 3 నాభిల సృష్టి. కాలం లెక్కలు అలా ఉంటాయి. అలా అనంతంగా చెప్పుకుంటూ ఉంటే బ్రహ్మం దగ్గర ఆగుతుంది కాలం. పరం, పరం నుంచి 3 గా వస్తూ ఉంటాయి. పరంతో కలిపి 4. ఈ రుద్రుడు కాలుడులో బలంగా ఉన్నాడు.

## 4. మహత్తు - ఉమ :

మహత్తునే మాఘమాస తత్త్వము అంటారు. "మఘ" అను పదము నుండి 'మేఘస్' అను పదము పుట్టినది. మఘ నక్షత్రమే 'మేఘస్ స్టార్'. దాని ప్రభావము వలన ఉన్నది లేనట్లుగాను, లేనిది ఉన్నట్లు గాను గోచరిస్తుంది. దానినే మేజిక్ అని ఆంగ్లములో అంటారు. తెలుగులో మాయ అని చెప్పాల్సి ఉంటుంది. మాయనెరిగిన జాతులు భూమి మీద వసించిన సందర్భములున్నాయి. నేడు మెక్సికో, కాలిఫోర్నియా, మయామి అని పిలువబడుతున్న ప్రాంతాలు ఒకప్పుడు "మయా" నాగరికత కలిగి ఉండేవి. మన దేశములో కూడ నాగాలాండ్, నాగపూర్ ఇత్యాది ప్రాంతాలలో కాలజ్ఞానం కలిగిన బృందములు ఉండేవి. "నాగ" పదమే మాయకు అతి దగ్గర పదము. 'గ' అంటే కదలిక. 'అ', 'గ' అంటే కదలిక లేనిది. 'న', 'అ', 'గ' కదలిక లేనట్లుగా కనిపించేది. కాని కదులుతూనే ఉంటుంది. మాయకు ఇది మూల సూత్రము. భూమి కదలలేనట్లుగా ఉన్నా కదులుతూనే ఉన్నదిగా! "కదిలినట్లు తోచు కదలకుండు". ఈ సత్యమును ఎరగడము మహత్తును ఎరగడమే. అప్పుడే సృష్టి యందు మాయ దర్శనమిస్తుంది. మహత్యం ఉంది, అంటారు ఏమిటంటే ఉన్నది

లేనిది అవడం, లేనిది ఉన్నది అవడం మహత్తు. మనకు కనబడనిది, ఆయనకు కనబడేది ఒకటుంది. ఆ కనబడని చోటు నుంచి కనబడే చోటుకు పట్టుకొచ్చేవారుంటారు. వారిని మహర్షులు అంటారు. మహత్తును చూసినవారు అని అర్థం. మహత్తును ఆకళింపు చేసుకున్నవారు అని అర్థం. ఋషి అంటే చూడగలిగినవాడు, మహర్షి అంటే మహత్తును చూడగలిగినవాడు. మాఘమాసము ఈ ప్రజ్ఞ నుంచే వచ్చింది. 'మఖ' నక్షత్ర ప్రభావం దీని నుంచే పనిచేస్తున్నది. మహత్తులో బలం ఈయన.

లేనిది ఉన్నట్లుగా కనిపించే శక్తి. ఉన్నది లేనట్లుగా అదృశ్యమవడం. ఈ దృశ్య అదృశ్యముల కథ ఉన్నదే దానిని మహత్తు అంటారు. "మహత్తు" నుంచే 3 అహంకారములు పుట్టుకొచ్చి దాని నుంచి సమస్తం దిగి వస్తుంది. ఈ మహత్తుకు కారణం కాలం, ప్రకృతి, శక్తి అని చాలాసార్లు చెప్పుకున్నాము. మహత్తు వలన సూక్ష్మంగా ఉన్నదంతా క్రమంగా కనిపించేటట్లుగా వస్తుంది. కనిపించేది అంతా లేనట్లుగా వెళ్ళిపోతుంది. ఒక ఉచ్ఛ్వాస, ఒక నిశ్వాస. కాలం రూపంలో కనబడుతున్నవి కనబడ కుండా వెళ్ళిపోతాయి. కనబడనపుడు లేనట్లు కాదు. కనబడినపుడు ఉన్నట్లూ కాదు. అలా మారుతూ ఉంటుంది.

ఆ సంధి కాలమునే Aquarius అంటారు. అందుకే కుంభరాశికి ఒక సంకేతం యిస్తారు. ఒక స్త్రీ ఒక బిందె పట్టుకుని ఉంటుంది కుడిభుజం మీద. ఆ బిందెకి ఇటు మూతి ఉంటుంది. అటు మూతి ఉంటుంది. అటు మూతి నుంచి చోటే లోపల ప్రవేశిస్తుంది. ఇటు మూతి నుంచి నీరు బయటకు వస్తూ ఉంటుంది.

అంతకుముందు కనబడకుండా ఉన్న జలము అనగా నారములు కనిపించనివి కనిపించేటట్లుగా వస్తాయి. మరలా ఇటునుంచి అటు అదృశ్యమైనట్లుగా ఉంటుంది. ఈ మహత్తు తెలిసినవారినే మహర్షులు అంటారు. అప్పటికప్పుడు సృష్టించడం, అప్పటికప్పుడు అంతర్ధానమవడం. లేనిది ఉన్నట్లు, ఉన్నది లేనట్లు. ఇలాంటి శక్తి ఒకటి ఉంది. ఇలాంటి శక్తిని నిర్వర్తించేవాడిని మహత్తు అంటారు. మహత్తు శక్తిని ఉమ అంటారు. మార్పు జరిగే సన్నివేశం. పగలు రాత్రిగా, రాత్రే పగలుగా అవుతుంది. ఒక ఉచ్ఛ్వాస తీసుకుంటారు. ఆ ఉచ్ఛ్వాసే నిశ్వాసగా వస్తుంది. విరామం ఉంటుంది. ఒక ఆలోచన వస్తుంది. ఆ ఆలోచన అయిపోకుండానే ఇంకో ఆలోచన వస్తుంది. ఆలోచనకి, ఆలోచనకి మధ్యలో విరామము ఉంటుంది. దృశ్యాదృశ్యంగా ఉంటుంది. ఆ శక్తినే 'ఉమ' అని పిలుస్తారు.

## 5. శంకరుడు - నియుత్తు :

నియుత్తు అనగా సద్వినియోగము అని. సద్వినియోగము ఉన్నచోట కాలము, ద్రవ్యము, అనుభవము వ్యర్థము కావు. కాలము ద్వారా అందివచ్చిన అవకాశమును సద్వినియోగము చేయడానికి శంకరప్రజ్ఞ ప్రధానము. శంకరుడు సమదర్శనము, సమభావము, సమతుల్యము కలిగిన రుద్రుడు. శంకరుని స్పర్శ వలన ప్రజ్ఞ ఊర్ధ్వస్థితి చెంది కాలమును, దేశమును బట్టి అవకాశమును సద్వినియోగము చేసుకోవచ్చు. సద్వినియోగము వలనే జీవునికి తృప్తి, పరితృప్తి కలుగుతాయి. వ్యర్థము లేని జీవనము వలన జీవుడు పురోగతి సాధిస్తాడు. శంకర స్పర్శ పొందిన జీవుడు సర్వము సద్వినియోగము చేస్తూనే ఉంటాడు. ప్రాణము, ప్రజ్ఞ

చక్కగా నిర్వర్తింపబడి ఉపయుక్తమగు అనుభూతి పొందుతూ ముందుకు సాగుతుంటుంది. శంకరుడు హృదయమునందుండి తన వినియోగ శక్తిని నిర్వర్తించుతూ, సదాశివుడై ఉంటాడు. అట్టి సమయములో సదా గౌరి వలె నియుత్తు మహదానందము కలిగిస్తుంది.

శివశక్తి దేనినైనా నియమించగలదు. రుద్ర ఆరాధన చేసేవాడు దేనినైనా నియమించే శక్తి గలవాడుగా ఉంటాడు. తనను తాను నియమించుకొనగలిగిన వాడే ఇతరులను నియమించగలడు. తనను తాను పరిపాలన చేసుకోనివాడు ఇతరులను పాలన చేయలేడు. ఈ శక్తి శంకరుడు ఇస్తాడు. ఈయన భార్య నియుత్తు. నియుత్తు అంటే చక్కగా వినియోగించడం. నియుత్తు తెలిసినవారికి ఎవరిని, ఏ విషయములో, ఏ రకంగా నియుత్తం చేయాలో తెలుసు. అలా కానపుడు తెలియక పొరపాట్లు చేసుకుంటూ ఉంటాము. మొత్తం సృష్టిలో సమస్తమైన వనరులను లేక శక్తిని చక్కగా సద్వినియోగం చేసే శక్తిగా 5వ రుద్రుడు శంకరుడు, శక్తి నియుత్తు.

వీరిలో శివుడనే రుద్రుని శంకరుడంటారు. ఇతడే ముఖ్యుడు. అతడు అంతర్యామి యొక్క తత్త్వము. ఇతనిని గూర్చే వేదము *"నమశ్శివాయచ శివతరాయచ"* అని కీర్తించుతున్నది. ఇతని పేరుననే *"నమశ్శివాయ"* అను పంచాక్షరీ మంత్రం వెలువడినది. "రుద్రులలో శంకరుడు నేను" అని గీతలో కృష్ణుడు చెప్పాడు. ఇతడు మన శరీరమున హృదయ స్థానమున వసిస్తుంటాడు.

**6. ఋతధ్వజుడు - సర్పిస్సు, 7. ఉరుడు - ఇల,**
**8. రేతోభవుడు - అంబిక :**

6, 7, 8 శక్తులు ఒకదానికి ఒకటి అనుబంధము (connection) కలిగి ఉంటాయి.

**ఋతధ్వజుడు - సర్పిస్సు :**

సర్పిస్సు అనే శక్తి ఋతధ్వజుడికి ఉన్నది. శుక్రధాతువు చక్కగా నిర్మాణమై ప్రజోత్పత్తికి తోడ్పడుతుంది. శుక్రధాతువు మనలో ఏర్పడడానికి ఒక రుద్రుడు ఈ పని చేస్తున్నాడు. ఋతధ్వజుడు శక్తి సర్పిస్సు (శుక్రధాతువు ఏర్పడడానికి శక్తి). భావన లోంచి అగ్ని ఆధారంగా చిన్న చిన్న పాము రూపాలలో, పురుషుడిలో దిగి వచ్చి, స్త్రీ శోణితముయందు ప్రవేశించి గర్భాన్ని కలుగచేస్తారు. ఈ రుద్రశక్తి పురుషుని వీర్యమునందు గాని, స్త్రీ శోణితము నందు గాని లోపించినట్లయితే సంతానము కలగదు. సంతానోత్పత్తికి రుద్రశక్తి ప్రధానము. వీర్యము వాహికే గాని, అందులో రుద్రశక్తే సంతానము కలిగించే ప్రజ్ఞ. బీజమందలి అంకురశక్తి, బీజవృద్ధికి ఎంత ప్రధానమో అలాగే రుద్రశక్తి వీర్యమునకు అంత ప్రధానము. సృష్టి యందలి ప్రజోత్పత్తి కార్యక్రమానికి రుద్రుడే ఆధారమని తెలియాలి. ఈ రుద్రశక్తి యగు సర్పిస్సును ఆరాధించడాన్నే సనాతన ధర్మమున సర్పముల ఆరాధనగా ఏర్పరిచారు. సర్పములకు అపకారము చేసేవారు ఈ రుద్రశక్తి కోల్పోయి సంతాన హీనులౌతారు.

**ఉరుడు - ఇల :**

"ఉరుడు" స్త్రీ యందు శుక్ర, శోణితములను గర్భధారణగా ఏర్పడడానికి కృషి చేస్తాడు. నీలో ఏర్పడిన శుక్రాన్ని చక్కగా ప్రవేశపెట్టగలిగిన తత్త్వము. సృష్టిలో జీవులు ఏర్పడాలంటే ఇది ఉండాలి. దీనికోసమే దేవతలు రుద్రుని గురించి తపస్సు చేస్తారు. నీయందు శుక్రము స్ఖలనము కాకపోతే సృష్టి ఉండదు. ఈ ఘట్టాలన్నింటికి శివపురాణంలో కథలుంటాయి. చాలామంది పురుషులలో శుక్రం ఏర్పడుతుంది కాని, శుక్రంలో జీవులను పుట్టించే శక్తి ఉండదు. శుక్రాన్ని తయారుచేసే శక్తి ఋతధ్వజుడు. ఉరుడు అంటే కలిపేవాడు. ఉరుక్రముడు అంటే పట్టి ఉంచేవాడు. ఉడుం పట్టు.

**రేతోభవుడు - అంబిక :**

అక్కడ నుంచి రేతోభవుడు. గర్భధారణ శక్తి. అందరూ గర్భం భరించలేరు. ప్రసవము (delivery) దగ్గర పడుతూ ఉంటే ఆరోగ్యాలు బాగుండవు. రక్తపోటు మొదలైన సమస్యలు వస్తాయి. శస్త్రచికిత్స చేస్తారు. పిల్లల్ని బయటకు నెట్టగలిగే శక్తి ఉండదు. అలాంటి వారికి అంబిక దేవత, రేతోభవుడు రుద్రుడు. గర్భం ధరించినపుడు ఈ రుద్రశక్తులు వినగూడదు, పఠించగూడదు అని చెప్తూ ఉంటారు. మాస్టరుగారు చెప్పారు ఎంత శక్తి నీవు ధరించగలిగితే నీలో అంత సమర్థత పెరుగుతుందని.

ధీశక్తి ఫాలభాగంలో బుద్ధి నుంచి కలిగే భావాలుగా తీసుకుంటే, అక్కడ నుంచి క్రమంగా వృత్తిలో ప్రవేశించిన వాళ్ళము

పెరుగుతూ ఉంటే కాలము రూపంలో, ఒక స్థితి తరువాత విరామం ఏర్పడితే, వినియోగం జరిగే చోటు ఒకటి ఆరో కేంద్రంలో సర్పిస్సు శక్తిగా ఉంటే, 7వ కేంద్రంలో 'ఇల' అనే శక్తిగా శుక్రధాతువు నుండి పరిమాణం ఏర్పడి, అంబిక అనే తత్త్వంలో గర్భధారణ జరిగేవరకూ 8 మంది రుద్రులు పనిచేస్తున్నారు. కాబట్టి జీవుల పుట్టుక అంతా కూడా ఈ రుద్రశక్తి వలన జరుగుతుంది. మనలో ఉండే ధీశక్తి మన చైతన్యానికి బలం. అది క్రమంగా శుక్రధాతువుగా అవతరణ చెంది స్త్రీ గర్భాన్ని చేరి అందులోంచి జీవుడిని పుట్టించేస్తారు. ఇది ఒక రకంగా కుమార సంభవము కథ లాంటిది. జీవుల పుట్టుకకు సంబంధించిన ప్రాతిపదిక ఇది. ఎవరికి తొడలయందు బలం ఉంటుందో వారే బలమైన సంతానాన్ని కనగలరని శాస్త్రంలో ఉన్నది. తొడలు, పిక్కలు బలంగా గల స్త్రీలే ఈ ధారణ బాగా చేసి, ప్రసవించగలరు. లేనివారికి పొట్టకోసి బయటకు తీయాల్సిందే. గర్భధారణ కూడా అంతంత మాత్రంగా ఉంటుంది. ఈ రుద్రులందరూ మనలో పనిచేస్తున్నారు. మనలో సూక్ష్మలోకాలలో కూడా ఈ ప్రజ్ఞలు ఇలాగే పనిచేస్తాయి. రుద్రశక్తి లేకపోతే సంతానం కలగదు.

**9. కాలుడు - ఇరావతి :**

"ఇరావతి" మెఱపు తీగ. Electric Hint అంటాము కదా! మనకి అప్పటికప్పుడు మంచి ఆలోచన భాసిస్తుంది. మామూలుగా ఆలోచన రావడం వేరు, మెఱపులాంటి ఆలోచన రావడం వేరు. మెఱపు ఆలోచనని "ఇరావతి" అంటారు. ఇచ్చినవాడు కాలుడు. ఈ కాలుడు స్ఫూర్తినిస్తాడు. ఒక్క మెఱపు ఆలోచన వలన

జీవితంలో అత్యద్భుతమైన కార్యాన్ని నిర్వర్తిస్తారు. కొంతమంది స్ఫూర్తి పొంది, కార్యక్రమాలు నిర్వర్తిస్తారు. ఆ రుద్రుడిని కాలుడు, శక్తిని ఇరావతి అంటారు. మెఱపుతీగ. Intuition అంటాము. మంచి ఆలోచన వచ్చి వెళ్ళిపోతుంది. ఒక పుస్తకం, pen దగ్గర పెట్టుకుని, వ్రాసుకుని, దానిని నిర్వర్తించగలగాలి. కాలహరణం లేకుండా ఉంటుంది. ఎప్పుడైనా రావచ్చు ఆలోచన. నువ్వు తలచుకుంటే రావు. కాలం రూపంలో కాలుడు అందిస్తాడు. కలలో అయినా, ప్రయాణంలో అయినా, ధ్యానంలో అయినా అందించవచ్చు. ఇవ్వడం కాలుడు ఇచ్చినా, దానిని మనయందు పొందిక చేసుకోవడం అనేది ఇరావతి అనే తత్త్వం మనయందు ఉన్నట్లయితే జరుగుతుంది.

మాస్టర్ సి. వి. వి.గారి యోగసాధన యందు ప్రార్థనలో ఇలాంటి స్ఫురణ, స్ఫూర్తి మెఱపు తీగల్లాగా కలుగుతుంటాయి. మాస్టరుగారు దీనిని Electric Hint అని పిలిచారు. గురుకృపగా ఊర్ధ్వ లోకముల నుండి మెఱపు తీగల్లాంటి ఆలోచనలు కాలం రూపంలో అంది రావడం ఈ యోగము నిర్వర్తించుచున్న వారికి సాధారణంగా జరుగుతుంటుంది. అప్రమత్తతతో వీటిని స్వీకరించి అనుసరించే ప్రయత్నము చేయాలి. భక్తులకు, జ్ఞానులకు, యోగులకు భగవంతుని ఆదేశాలు అందిరావడమనేది ఇరావతి అనే శక్తి వలననే! దూరశ్రవణం, దూరదృష్టి, ఊర్ధ్వలోక బోధనలు ఇత్యాదివి ఈ కాలుడనే రుద్రుడు, ఇరావతి అనే రుద్రశక్తి కారణంగా జరుగుతుంటాయి. ఇటీవలి కాలంలో Madam Blavatsky, Alice A Bailey, మాస్టర్ E. K. అనేకానేకమైన బోధనలు, రచనలు ఈ రుద్రశక్తి అనుగ్రహంగానే

లోకానికి అందించారు. కేవలము మేధస్సు ఉన్ననూ మెఱపుతీగ వంటి ఆలోచన వారి యందు భాసించదు. భాసించడము ఒక అనుగ్రహము. సరైనకాలంలో, సరియగు భావన కలగడమే కష్టము. గాయత్రి అనుగ్రహము చేతనే అది సంభవము. కానీ విశేషమగు ఆలోచన అకస్మాత్తుగా స్ఫురించడము ఒక ప్రత్యేకత. వేదవ్యాసుని మహాభారత దర్శనము కాని, వాల్మీకిమహర్షి రామాయణ దర్శనం గాని, పోతనామాత్యుని ఆంధ్ర భాగవత దర్శనం గాని ఈ రుద్రశక్తి అనుగ్రహం వలన జరిగి లోకోత్తరమగు దివ్యకావ్యములు ఏర్పడ్డాయి. కాలుడు, ఇరావతి అనుగ్రహము వలన విశిష్ట కార్యములు భూమిపై అకస్మాత్తుగా ఏర్పడతాయి.

## 10. వామదేవుడు - సుధ :

వామదేవుడు అనే రుద్రుడికి సుధ అనే శక్తి. సుధ అంటే చక్కగా ధరించడము. అద్భుతమైన భావాలు అందరికీ కలగవచ్చు. వాటిని ధరించి, భరించడం అందరివల్లా కాదు. కొంతమందికి పుట్టలు పుట్టలుగా మంచి ఆలోచనలు రావచ్చు. వాటిని ధరించే శక్తి, భరించే శక్తి కావాలి. నిర్వర్తించే శక్తి కావాలి. అది ఎవరియందు ఉంటే వారు "సుధ" అనే తత్త్వం కలవారు అవుతారు. సుధ అంటే అమృతం అనే భావన ఉన్నా సుధ అంటే చక్కగా ధరించగలగడం. కొంతమంది అదృష్టం, ఆనందం వచ్చినా పట్టలేరు. సంతోషం వచ్చినా పట్టలేక తల్లక్రిందులయ్యేవారు చాలామంది ఉంటారు. గంగావతరణం జరిగినదనుకోండి. ఆ గంగను ఎవరు పట్టగలిగారు? రుద్రుడే పట్టగలిగాడు. చక్కగా ధరించాడు. అంత శక్తిని పట్టి భూమి మీద

జల ప్రవాహం ఏర్పరచేటట్టు చేసేవాడు, సుధ అనే రుద్రశక్తి. అలాగే మనలో కూడా వచ్చే ఆలోచనలను పట్టడం, చక్కగా నిర్వర్తించుకోగలగడం, పాడుచేసుకోకుండా వృద్ధి కలిగించడం, దానిని ధరించడం, భరించడమూనూ. చాలామంది ధ్యానాలు చేస్తారు. ఎక్కువైతే పట్టలేక మనోవికారాలు వస్తాయి. పట్టలేకపోతే దేహమందు కొన్ని ఇబ్బందులు వస్తాయి. అన్ని విధాలుగా బుద్ధియందు, మనస్సుయందు, ప్రాణమునందు, ఇంద్రియముల యందు, శరీరము నందు పట్టలేకపోతే రకరకాలుగా ఊపేస్తూ ఉంటుంది. పట్టలేని విషయాన్ని పట్టుకోవాలనుకున్నప్పుడు రకరకాల ఇబ్బందులు పడతాము. ఎందుకంటే “సుధ” అనే శక్తి మనలో బలంగా లేకపోవడం. అలా జరగాలి అంటే *“వామదేవాయ నమః”* అనుకోవాలి. వామదేవుని భార్య పేరు సుధ. సుధ అంటే చక్కగా ధరించగలుగుట. గురువుగారు ధ్యానం ఇచ్చారు, చక్కగా ధరించగలగాలి. కుటుంబం, సంపద, పేరు అన్నీ వచ్చినా ధరించగలగాలి. ఏది వచ్చినా ధరించలేని వాడికి ఆనందం లేదు. ఏం వచ్చినా పాడుచేసుకునే వాడికి ఆనందం ఏమున్నది? పదార్థమైన లోకాలైనా, దివ్యమైన లోకాలైనా, అజ్ఞానమయ లోకాలైనా ధరించగలగాలి. అలా ధరించడానికి వీలు పడినప్పుడే జీవితంలో సంతోషం. అందివచ్చినవి ధరించగలిగినప్పుడు మనకి బావుంటుంది. ఇది సుధ వలన జరుగుతుంది. *వామదేవాయ నమః!* వామ అంటే అమ్మవారు. నవవిధ ప్రకృతి. నవవిధ ప్రకృతికి ఆధారంగా ఉండేవాడు ఆయన. ఆవిడ వామభాగం కదా! ఈ ఎడమకి ఆ కుడి ఆధారం.

## 11. ధృతవ్రతుడు - దీక్ష :

ధీ శక్తి సంకల్పమైనపుడు దానిని అనంతమైన కాలము అలా నిర్వర్తించుకోవడం దీక్ష. చాలామంది మంచి కార్యాలు మొదలుపెట్టి మధ్యలో వదిలిపెడతారు. సృష్టికార్యం చేసేటప్పుడు బ్రహ్మదేవుడు నావల్ల కాదని వదిలిపెట్టలేదుగా! ఎవరు ఇచ్చారు ఈ శక్తి? అదే రుద్రశక్తి! చిన్నతనంలోనే పంచాక్షరీ అలవాటు చేస్తారు. ఈ 11 శక్తులు మనలో పనిచేయాలంటే పంచాక్షరి, రుద్రనమకం, రుద్ర మంత్రం బాగా చేసుకోవాలి. పిల్లలు పెరిగే సమయంలో వారిలో శక్తులు బలంగా ఏర్పడతాయి. ఎప్పుడో మనకి 50 సంవత్సరాలకు మొదలుపెడితే అవదు. 35 సంవత్సరాలకు శరీరంలో పట్టగలిగిన వాళ్ళకి పడుతుంది. 35 సంవత్సరాల తరువాత కొత్తగా మనసుకు పట్టడం కష్టం. కుస్తీ పట్టడమే ఉంటుంది కానీ పట్టదు. ఈ 11 మంది రుద్రులు, వారి శక్తులు, అద్భుతమైన విషయాలుగా గుర్తించి 5 సంవత్సరముల పిల్లల చేత బాగా చేయిస్తే, అటుపైన 10 సంవత్సరములు నిండిన తరువాత రుద్రమంత్రం బాగా చేయిస్తే, అలాంటి వారికి ఈ 11 మంది రుద్రులు శిరస్సు నుండి పాదం దాక బాగా స్థిరపడతారు. 11 రకాల శక్తులు వారియందు ఆవిష్కరింపబడతాయి. అలాంటి జీవుడు మహత్కార్యాలకు పనికివస్తాడు. ఇదంతా మనస్సులో పెట్టుకుని మన ఋషులు ఏం ఇవ్వదలచుకున్నా 21 ఏళ్ల లోపల కార్యక్రమం పూర్తి చేసేవారు. ఇక్కడ నుంచి జీవుడు పదను పెట్టుకోవడమే. 35 సంవత్సరముల తరువాత చాలా కష్టం. 5 సంవత్సరములకు మొదలుపెట్టి 10 సంవత్సరములకు దానియందు శ్రద్ధ కలిగితే ఫలితం ఉంటుంది.

అక్కడనుంచి 7 లేక 8 సంవత్సరాలకి దానియందు పట్టు వస్తే ఈ 11 మంది రుద్రులు మనలో బాగా స్థిరపడినట్లే లెక్క.

ఒకే పనిని అనంతకాలముగా చేయడం దీక్ష. ఒకరోజు చేసి, ఒకరోజు చేయకుండా అలాకాదు. ఈ దీక్ష ఎంత ఉంటే నిరంతరత్వము (continuity) అంత ఉంటుంది. జన్మల తరబడి ఒకే కార్యక్రమాన్ని చేయగలిగిన శక్తి ఉండడం వలన, చేస్తున్న పని నిరంతరంగా ఉండడం వలన మనుషులు ఋషులు అయ్యారు, మహాత్ములు అయ్యారు. అలా నిరంతరత్వము (continuity) లేని చోట ఏదో చచ్చిపోతూ ఉంటాము. ఒక పని కొన్నాళ్ళు చేసి ఆపేసి, ఇంకో పని కొన్నాళ్ళు చేసి ఆపేసి, ఏదీ పూర్తి చేయకుండా అన్నీ అరకొర పనులు చేశామనుకో, అరకొర జీవితమే అయిపోతుంది. అలాకాకుండా ఉండాలంటే దీక్ష కావాలి. దీక్ష రుద్రుడు ఇస్తాడు. ధీశక్తి మొదటిది, దీక్ష చివరిది. కేవలం బుద్ధిబలం వలన పనులు కావు. ధీ అంటే బుద్ధి. ఒక మంచి పూజ, ఒక మంచి కార్యము, ఒక మంచి ధ్యానము చేస్తూ, ఇంకొకటి వస్తే ఇది మానకూడదు. ఇంకొకటి వస్తే అదీ చేయగలిగితే చేయి. ఉన్నది మానేసి కొత్తది చేస్తే ఉపయోగం లేదు. పెట్టిన ఇటుకను ఇంకొక ఇటుక వస్తే అంతకుముందుది తీసేసి ఇది పెడితే పని ఏమౌతుంది? దీక్ష వలన జన్మజన్మలు ఒకే కార్యక్రమం మీద నిలబడగలిగే శక్తి వస్తుంది. అలాంటి శక్తి రుద్రుడు ఇస్తాడు.

దీక్షకి రుద్రుడు ధృతవ్రతుడు. ఏం చేసినా వ్రతంగా చేస్తాడు. ప్రతిదానికి సాకులు చెప్పి పనులు మానేసే వాళ్ళు ధృతవ్రతుడు కారు. ఒకపని చేస్తున్నప్పుడు ఎన్ని పనులు వచ్చినా

ఇది వదలకుండా చేయగలగాలి. ఇవాళ ఒంట్లో బాగోలేదు, పాఠము చెప్పను అనుకుంటే పై వారం ఒకటి వస్తుంది. ఇంకో వారం ఇంకొకటి వస్తుంది. ప్రార్థన చేసుకుందామన్నా ఈరోజు ఒకటి, ఇంకోరోజు ఒకటి వస్తుంది. అంతరాయములు లేక అధిగమించాలంటే, పురోగతి సాధించాలంటే ధృతవ్రతుని దీక్ష ఉండాలి. ఇవాళ మొదలుపెట్టి మూడు రోజుల తరువాత మానేశామనుకోండి, పనికిరాదు. ఏ పని మొదలుపెట్టినా అది అలా కొనసాగుతూ ఉండాలి. అలాంటి వారి జీవితం కొనసాగుతుంది. వారి కార్యక్రమాలు కొనసాగుతాయి. దేహం పడిపోయినా, దేహం తెచ్చుకుంటాడు, కొనసాగిస్తాడు. వాళ్ళు చిరంజీవులుగా మారుతారు. కొన్నాళ్ళు కొన్ని పనులు, కొన్నాళ్ళు కొన్ని పనులు, అంటే దీక్ష లేనట్లే. దీనికి ఒక కథ ఉన్నది. ఏసుక్రీస్తు స్వయముగా చెప్పిన కథ. ఒకడు పొలంలో బావి తవ్వుతూ ఉంటాడు. మూడు అడుగులు తవ్వగానే ఒకడు వచ్చి 'ఇక్కడ వద్దు, అక్కడ తవ్వు' అంటాడు. ఇక్కడ మూడు అడుగులు తవ్వగానే ఇంకొకడు వచ్చి 'ఇక్కడ వద్దు, వేరొకచోట తవ్వు' అంటాడు. పొలం అంతా 100 గుంటలు తవ్వేస్తాడు. ఏసుక్రీస్తు వచ్చి అడుగుతాడు ఏమిటి ఇది? అని. ఒక గుంట తవ్వి అదే తవ్వుతూ ఉంటే నీళ్ళు పడతాయి కదా! నీ జన్మంతా వ్యర్థము (waste) అయినది, అంటాడు. ఏ ఒక్కటి దీర్ఘకాలము చేయకపోవడం వలన దృఢత్వము, సిద్ధి ఉండదు. భక్తులమనుకునే వారు రకరకముల ఆరాధనలు చేస్తూ ఉంటారు. రకరకములుగా దేవతా రూపములు మార్చుకుంటూ ఉంటారు. గురువులను, ఆశ్రమాలను మార్చుకుంటూ శ్రమ పడుతూ ఉంటారు. ఒకే సత్యము, ఒకే ధర్మము, ఒకే మార్గము అని తెలిసే

వరకు ప్రతిచోటా కొంత శ్రమపడుతూ, ఆరాటపడుతూ ఉంటారు. దృఢమైన విశ్వాసము పెరగాలంటే ధృతవ్రతుని ఆశ్రయించాలి. అప్పుడు సద్గురువు లభించి జగద్గురువు మార్గములో నడిపిస్తాడు. జగత్తునంతా నడిపించే నర–నారీ స్వరూపుడు ఈశ్వరుడే అని, దానికి మూలము బ్రహ్మమే అని మార్గమిచ్చి, సహకారం అందించి రక్షిస్తాడు. ధృతవ్రతుడు అనే రుద్రుడు అన్నిటికీ పునాది అని తెలియాలి. ఎట్టి పరిస్థితులలోనూ నిర్వర్తించడము అనేది ధృతవ్రతుడు యిస్తాడు. వాని భార్య పేరు దీక్ష. ధృతవ్రతుడు అంటే స్థిరమైనవాడు అని అర్థము. గుండ్రాయి నుంచి పరమాత్మ వరకూ అన్నింటా ఆయనే ఉంటాడు. ఎప్పుడో శివుని గురించి వేరే చెప్పుకోవాలి. దానికో పురాణం ఉన్నది. ఇలాంటి మహిమగల శివుడు మనలో కూడా ఉన్నాడు. మనలో లేనిదేమీ లేదు. మనకు తెలిసినదీ ఏమీ లేదు. అదీ తమాషా!

వీరందరూ శరీరమందలి వేడిమి, వెచ్చదనము, ఇంద్రియ ప్రవృత్తులు, ఆకలిదప్పులు మున్నగు వ్యాపారముల కధిపతులై ఆ ప్రవృత్తులను సృష్టించారు. 11 శక్తులు రుద్రుని యందు నిక్షిప్తమై యున్నవి.

భాగవతం విష్ణువుని గురించి చెప్తున్నది కదా! ఇదేమిటండి? విరాట్పురుషుడి ఫాలభాగంలో ఉన్న రుద్రుడి యొక్క ప్రజ్ఞ వివరణ శ్రీమద్భాగవతం తృతీయ స్కంధంలో ఉన్నది అని అనుకోరాదు. పురాణాలలో శివ కేశవ భేదం లేదు. ఇంతగా రుద్రుని గురించి ఎవరైనా వ్రాస్తారా? సమన్వయ భావన లేక ఇది వేరు, మరొకటి వేరు అనుకుంటాము. మీరు గుర్తుపెట్టుకోండి. 11 మంది రుద్రులు,

వారి పేర్లు, వారి శక్తులు, వారి స్థానములు. బీజప్రాయముగా రుద్రశక్తి వలన మొత్తం చీకటంతా కూడా వెలుగైపోతుంది. మనలో ఛిద్రాలు పోవాలంటే రుద్రుడే! ఏ ఛిద్రం ఉండదు. అందుకని చిన్నప్పటినుంచీ పంచాక్షరి యిచ్చారు. 5 ఇంద్రియములు, పంచభూతాత్మకమైన శరీరంలోనూ, పంచ తన్మాత్రలలోను, అన్నింటిలోనూ రుద్రుడు చేరిపోయాడనుకోండి. TVలు, Electronics, ఏం నేర్చుకున్నా ఇదిరాదు. చిన్న పిల్లవాడికి రుద్రమంత్రం నేర్పిస్తే వాడి వృద్ధి తరగదు. ప్రజ్ఞ ఎలా వికసిస్తే పని జరుగుతుందో అలా వికసింపచేయడానికి తల్లితండ్రులుగా మన ప్రయత్నం ఏది? వేసవి సెలవులలో ఏ ఊరు చూద్దామా, ఏ సినిమా చూద్దామా, ఏం ఆడుకుందాం అని గాకుండా వారాంతపు సెలవులు వాడుకోవాలి. ఎంత చేసుకుంటే అంత. రుద్రులలోంచే భర్గులు పుడతారు. భర్గులు అంటే వెలుగులు. వెలుగులు ఏర్పడిన తరువాత బ్రహ్మదేవుడు భర్గులను "ఇంకచాలు మీరు వెళ్ళండి" అంటాడు. ఇంకా ఉంటే కాలిపోతాయి అన్నీ. సూర్యుడు, చంద్రుడు, పంచభూతములు, ప్రాణం, ఇంద్రియములు, మనస్సు, హృదయం ఇంకా అన్నింటిలో నిండిపోయారు. ఆ తరువాత చేయాల్సింది ఏముంది? ఇంకా ఉంటే కాలిపోతుంది. ఈ బ్రహ్మదేవుడు "ఓ భర్గులారా! మీ రుద్ర సంబంధమైన చూపు ద్వారా అగ్ని పుట్టినది. దానివలన సమస్త లోకములు మండిపోవుచున్నవి. ఇంక మీరు సృష్టించుట చాలును" అని అంటాడు. ఈ పని రుద్రులే చేయగలరు. మిగిలినవారు చేయలేరు. తీసేయాలన్నా వీరే కావాలి. సృష్టి ఏర్పాట్లు వారే, సృష్టి తీసేయడం వారే! "ఇంక మీరు తపస్సు చేసుకోండి. మీకు శుభం కలుగుతుంది" అని చెప్తాడు. ఎక్కడికి

వెళ్లి తపస్సు చేసుకుంటారు? తాము ఎక్కడి నుంచి వచ్చారో అక్కడికి వెళ్లి తపస్సు చేసుకోవడమే! తత్త్వమునే పరబ్రహ్మము అని, భాగవతంలో నారాయణుడు అని అంటారు. మనము తిరోధాన దశలో ఉన్నప్పుడు రుద్ర ఆరాధన చేయాలి. ముసలితనంలో రుద్రుడు కొంచెం టాటా బై బై చెప్తూ ఉంటాడు. అలాగే మరపు వస్తుంది. ఏంటయ్యా అంటే మర్చిపోయాను, అంటాడు. వీడికి మండిపోతూ ఉంటుంది. అవతలివాడికి ముఖ్యము (important). వీడు మరచిపోతూ ఉంటాడు. ఎందుకంటే రుద్రుడు తప్పుకుంటాడు (missing). వెన్నెముకని 'ధ్వజం' లాగా నిలబెడతాడు. ప్రక్కకి, వెనక్కి, ముందుకి వంగిపోవడం జరగకుండా చూసిపెడతాడు.

11 మంది రుద్రులు, వారి భార్యలు, స్థానాలు, ఇవి గుర్తు పెట్టుకుంటే మనలో అన్ని దేవతా ప్రజ్ఞలు మేల్కొంచుతాయి. ఇవి మేల్కొంచితే మనలో అంత చీకటి ఉండదు. దేవతా ప్రజ్ఞలను ఈశ్వర ప్రజ్ఞలు అంటారు. అసుర ప్రజ్ఞలు ఉంటే లోపల చీకటి ఉంటుంది. విరాట్పురుషుడితో ఉండే ప్రజ్ఞలు, మనలో ఉండే ప్రజ్ఞలు ఒక్కటే. చతుర్ముఖ బహ్మ అంటే మనమే! అహంకార పురుషులము. బ్రహ్మమే మనంగా ఉన్నాము. నలుగురు కుమారులను ప్రతినిత్యం గుర్తుకు తెచ్చుకోవాలి. గురుపరంపరలో వారే ప్రధానమైనవారు. వారినుంచి సమస్త పరంపర సృష్టిలో ఏర్పడినది. అటుపైన 11మంది రుద్రులు, మనలో సూర్యప్రజ్ఞ, చంద్రప్రజ్ఞ, ఆకాశ, వాయు, అగ్ని, జల, పృథ్వి ప్రజ్ఞలు, తపస్సు, హృదయం, మనస్సు, ప్రాణం, ఇంద్రియాలు.

ఈ రుద్రులు లేకపోతే మనలో పంచభూతములు లేవు. ప్రాణం, తపస్సు చేయాలనే భావన ఉండదు. మనస్సుకు పటిష్ఠమైన భావన లేదు. హృదయమునకు కావలసిన బలం ఉండదు. అన్నీ తరంగాల వలె ఉన్నాయి. గుర్తు తెచ్చుకుంటూ ఉంటే మనలో పనిచేస్తాయి. శ్రద్ధ ఎంత ఉంటే అంత రహస్యమైన జ్ఞానం. విన్నపుడు గుర్తుంటుంది. తరువాత మరచిపోతాం. మరచిపోవడం సహజం. అజ్ఞానంగా మరపు ఉన్నది. ముందు పుట్టినవి అవే కదా! అవి పోవాలంటే ఇవి చేసుకోవాలి. ఖాళీ సమయంలో పిచ్చి పిచ్చి ఆలోచనలు చేయకుండా గుర్తు చేసుకోవాలి. ఎంతవరకు గుర్తున్నదో తెలుస్తుంది. ఇలాంటి విషయాలలో ప్రశ్నోత్తరాలు, ఇష్టాగోష్ఠి పెట్టుకోవాలి. అంత్యాక్షరి ఆడుకునే బదులు ఇవి ఆడుకోండి. ఇలాంటివి చేస్తే మనలో దేవతలు మేల్కొంచుతారు. గుర్తించకపోతే ఉంటారు మనలో. మనతో వాడికి సంబంధం లేదు అనుకుంటారు. తటస్థముగా ఉంటారు. గుర్తిస్తే సహకరిస్తారు. కేవలం నమస్కారం పెట్టినా, వారు సంతోషపడి నీకేమి కావాలో అది చేసిపెట్టడానికి సంసిద్ధంగా ఉంటారు దేవతలు. వారిని గుర్తిస్తే నీలో ఆ భాగం వెలుగుతుంది. ఆ దేవతా ప్రజ్ఞలను గుర్తించకపోతే వెలగదు. అక్కరలేని విషయాలు గుర్తుండడం లేదూ? సులభంగా గుర్తుంటాయి. మనం వీరినందరిని గుర్తు చేసుకుంటూ ఉంటే గుర్తు చేసేటట్లుగా వారే ఉంటారు. అలాంటివి ఈ ప్రజ్ఞలన్నీ. రుద్రాధ్యాయం అని మాస్టరుగారు ఇచ్చారు. చదువుకుంటే బాగుంటుంది. చదువుకుంటే మనలో శ్రద్ధను బట్టి చాలా వికాసం వస్తుంది. అలా తెలుసుకుంటూ పోవాలంటే సమయమును మనం ఏర్పాటు చేసుకోవాలి. ఈ విషయమంతా (subject) ఘనీభవించాలి. లేకపోతే ఆవిరయి ఇంకిపోతుంది.

# 4. రుద్ర మంత్రములు

## 1. ఓం నమో భగవతే రుద్రాయ ఓం

ఇది పదునొకండు అక్షరముల రుద్ర మంత్రము. హృదయము నందు ఓంకారమును భావించి, అష్ట దిక్కులకు హృదయము నుండి ఎనిమిది వెలుగురేఖలను వ్యాప్తి చేసి, ఊర్ధ్వమునకు, అధస్సునకు కూడా వెలుగు రేఖను భావన చేసి, పది రేఖల అంచులను కలిపినచో ఒక లింగాకారము ఏర్పడుతుంది. ఆ లింగము నందు మనముండగా, మన చుట్టును తెల్లని వెలుగుతో లింగముండగా ఈ పదునొకండు అక్షరముల మంత్రమును దీక్షతో ధ్యానము చేయువానికి సర్వ శుభములు కలుగును. రక్షణ కూడా కలుగును. ఇట్లు ఆరాధన చేసినపుడు మన హృదయమున శివుడు ఉండగా, మనము శివుని యందు ఉన్నట్లు గోచరించి సాధకుడు తృప్తుడగును.

## 2. ఓం నమః శివాయ

ఈ మంత్రము నందు ఓంకారమును ఆజ్ఞ యందును, నమః శివాయ అను ఐదు అక్షరములను ఐదు కేంద్రముల యందును దర్శిస్తూ రుద్రుని ధ్యానించ వచ్చును. ఇట్లు ధ్యానించుట వలన మనయందు షట్ కేంద్రములు, షట్చక్రములు ప్రభావితమగును.

**3. యో రుద్రో అగ్నౌయో అప్సుయ ఓషధీషు,**
**యో రుద్రో విశ్వాభువనా వివేశ తస్మై రుద్రాయ నమో అస్తు.**

ఈ మంత్రమును శ్రద్ధతో ధ్యానించినపుడు సమస్తము నందును రుద్రుడే నిండి ఉన్నాడని వికాసము కలుగును. రుద్రమంత్రములలో ఈ మంత్రమును అత్యుత్తమ మంత్రముగా తెలుపుదురు. ఈ మంత్రము నందు ''రుద్ర'' అను పదము మూడుసార్లు ఉచ్చరింపబడును.

**4. త్ర్యంబకం యజామహే సుగంధిం పుష్టి వర్ధనమ్,**
**ఉర్వారుకమివ బంధనాన్ మృత్యో ర్ముక్షీయ మామృతాత్.**

ఈ మంత్రమును మృత్యుంజయ మంత్రముగా పేర్కొందురు. ఈ మంత్ర ప్రభావమును గురించి ముందు పాఠంలో వివరించితిని.

**5. నమః శంభవేచ మయోభవేచ నమః శంకరాయచ,**
**మయస్కరాయచ నమశ్శివాయచ శివతరాయచ.**

ఈ మంత్రమును పఠించునపుడు హృదయమందు శాంతి పుట్టును. శరీరము నందు సౌఖ్యము ఉండును. మనస్సు చల్లగా ఉండును.

**6. నమస్తే అస్తు భగవన్ విశ్వేశ్వరాయ, మహాదేవాయ, త్ర్యంబకాయ, త్రిపురాంతకాయ, త్రికాగ్ని కాలాయ, కాలాగ్ని రుద్రాయ, నీలకంఠాయ, మృత్యుంజయాయ, సర్వేశ్వరాయ, సదాశివాయ, శ్రీమన్మహాదేవాయ నమః.**

ఈ మంత్రము రుద్రుని పదునొకండు గుణ విశేషములతో ఆరాధింపబడినది.

## 7. శివోహం

ఈ మంత్రము "శివుడే నేను" అని తెలియచేయును. ఇది క్లుప్తమే అయినను సర్వ సిద్ధి నిచ్చును.

## 8. ఓం నమశ్శివాయైచ నమశ్శివాయ

శివ శక్తుల ఆరాధనగా ఈ మంత్రమును శ్రీ శంకరాచార్యుల వారు అర్ధనారీశ్వర స్తోత్రమున అందించినారు. ఈ మంత్రమును కూడా నిత్య స్మరణలో చేసుకొనవచ్చును.

రుద్ర మంత్ర పఠనమునకు ప్రధానముగా మూడు గాని, ఐదు గాని, ఏడు గాని, తొమ్మిది గాని, పదునొకండు గాని, ముప్పది మూడు మార్లు గాని చదువుట సంప్రదాయము. మంత్రములను చదువునపుడు, ధ్యానించునపుడు అవకాశమును బట్టి ఈ అంకెలను అనుసరించుట వలన పరిణతి కలుగును. శబ్దము, వెలుగు, సంఖ్య ఈ మూడింటిని పాటించినపుడు మంత్రము సిద్ధించును.

మంత్రము ఎట్లు చేయవలెనో తెలియుటకై మంత్రమును గూర్చి పుస్తకము వెలువడి యున్నది. దానిని ఒకమారు పఠించినచో మంత్రోపాసనమునకు వలసిన మర్మములు తెలియును.

పై మంత్రములన్నియు దాదాపు అందరికి తెలిసినవే అయినను శ్రద్ధ, దీక్షను బట్టి వికాసము, సిద్ధిని ఇచ్చును.

*స్వస్తి!*

## ధనిష్ఠ ప్రచురణలు - మాస్టర్ పార్వతీకుమార్ గారి రచనలు

| | | |
|---|---|---|
| 1. | అమనస్కుడు | 30-00 |
| 2. | అసంగుడు | 25-00 |
| 3. | అన్వేషకుడు | 100-00 |
| 4. | అంబరీషుడు | 80-00 |
| 5. | అశ్వినీ దేవతలు | 100-00 |
| 6. | అంతర్దర్శన ధ్యానములు | 100-00 |
| 7. | ఆత్మసాధనా సూత్రములు | 50-00 |
| 8. | భారతీయ సంప్రదాయము | 20-00 |
| 9. | భాగవతమూర్తి భీష్ముడు | 100-00 |
| 10. | భాగవత సూక్తము-1 | 80-00 |
| 11. | భాగవత సూక్తము-2 | 80-00 |
| 12. | గోవు | 20-00 |
| 13. | గురుశిష్య సంవాదము | 60-00 |
| 14. | మాస్టరు యోగము - సాధనా సూత్రములు | 80-00 |
| 15. | మాస్టర్ సి.వి.వి. జన్మదిన సందేశము | 30-00 |
| 16. | మాస్టర్ సి.వి.వి. నూతన యోగము | 40-00 |
| 17. | మాస్టర్ సి.వి.వి. యోగము | 40-00 |
| 18. | మాస్టర్ సి.వి.వి. యోగము - కర్మరాహిత్యము | 20-00 |
| 19. | మాస్టర్ సి.వి.వి. - వరుణగ్రహ ప్రభావము | 22-00 |
| 20. | మన మాస్టరుగారు | 80-00 |

ప్రతులకు : **ధనిష్ఠ ఫౌండేషన్,**


15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్, కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002


ఫోన్ : 0891-2701531, 2509154,


website : www.dhanistha.org. info@dhanistha.org


# ధనిష్ఠ ప్రచురణలు







**ప్రతులకు : ధనిష్ఠా ఫౌండేషన్, 15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్, కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.**

Phone : 0891-2701531 www.dhanishta.org info@dhanishta.org



రుద్ర రోదనము వలన రోదసి అంతా ప్రచోదనమై, ప్రణవమై వ్యాప్తి చెందుతుంది. ముందు పుట్టిన తరంగములు వాయుపై భాసిస్తాయి. అంటే ఆకాశము నుండి శబ్దము, శబ్ద తరంగములనుండి వాయువు మరియు వేడిమి వృద్ధి చెందుతాయి. అటుపైన జలములు, పృథ్వీ ఏర్పడతాయి. కనుకనే ఈ క్రింది మంత్రము ఇవ్వబడినది :

"యో రుద్రో అగ్నౌయో అప్సుయ ఓషధీషు,
యో రుద్రో విశ్వాభువనా వివేశ తస్మై రుద్రాయ నమో అస్తు."

ధనిష్ఠ

ISBN: 978-81-957285-0-3
9 788195 728503